
సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే 90% హామీలు నెరవేర్చి, పింఛన్లు, తల్లికి వందనం, దీపం-2, అన్న క్యాంటీన్లు, ఉపాధ్యాయ నియామకాలతో పాటు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులను ఆదుకుంటోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ




బుధవారం 13.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 122 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

## విజన్‌తోనే ...

# అభివృద్ధి వెలుగులు

**విద్యుత్ లేని ఊరు నుంచి వచ్చాను... విద్యుత్ సంస్కరణలు తెచ్చాను**

**నియోజకవర్గాల బలాలను బేరీజు వేయండి...అభివృద్ధికి తోడ్పండి**

**విజన్ తోనే అభివృద్ధి వెలుగులు సాధ్యం**

**ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకోండి**

**యంగ్ ప్రొఫెషనల్స్ ప్రభుత్వానికీ...నాకూ బలంగా ఉండాలి**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విద్యుత్ లేని ఊరు నుంచి వచ్చాను.. ఉమ్మడి రాష్ట్రంలోనే విద్యుత్ సంస్కరణలు తెచ్చానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. నిత్య విద్యార్థిగా ఉంటూ.. అభివృద్ధి గురించి నిరంతరం ఆలోచించడం వల్లే ఇది సాధ్యమైందని ముఖ్యమంత్రి వివరించారు. నియోజకవర్గాల వారీ సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించిన ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి పీజీ చేసిన ఒక యంగ్ ప్రొఫెషనల్ ను నియమిచింది. స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా రూపొందించిన నియోజకవర్గాల వారీ విజన్ డాక్యుమెంట్లకు అనుగుణంగా పనిచేసేందుకు నియమితులైన ఈ యంగ్ ప్రొఫెషనల్స్ కు ప్రణాళిక శాఖ వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చింది. మంగళవారం సచివాలంయలోని ఐదో బ్లాకులో శిక్షణ ముగించుకున్న యంగ్ ప్రొఫెషనల్స్ తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో యంగ్ ప్రొఫెషనల్స్ కు సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.."నియోజకవర్గానికో యంగ్ ప్రొఫెషనల్ నియమించడం కొత్త విధానం. నేను తొలిసారి సీఎం కాగానే ప్రాధాన్యతాంశాలను గుర్తించి.. దానికి అనుగుణంగా ప్లానింగ్ చేసుకున్నాను. యంగ్ ప్రొఫెషనల్స్ కూడా వారికి మిగతా 3లో...

## 'స్త్రీ శక్తి'కి సర్వ సిద్ధం

**ఆగస్ట్ 15న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**

**రద్దీ నిర్వహణ, మర్యాదపూర్వక ప్రవర్తన, భద్రత ముఖ్యం**

**ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడండి**

**ఆటో డ్రైవర్లకు సాయంపైనా సమగ్ర అధ్యయనం**

**అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి ఆదేశం**

2 లో

## బెస్ట్ లివబుల్ సిటీగా అమరావతి

**రికార్డు టైమ్ లో రాజధాని నిర్మాణాలు పూర్తి చేయండి**

**రియల్ టైమ్ లో రాజధాని పనుల పర్యవేక్షణ**

**ప్లాట్ల బదిలీలపై రాజధాని రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి**

**రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**గత ప్రభుత్వంలో నిర్మాణాలకు తెచ్చిన ఇసుకను కూడా ఎత్తుకెళ్లారని కాంట్రాక్టర్ల ఫిర్యాదు**

2 లో

## మెరుగైన ఆరోగ్య సేవలు

**30 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సొంత భవనాల నిర్మాణం**

**రూ.30 కోట్ల వ్యయంతో ఆమోదించిన మంత్రి సత్యకుమార్ యాదవ్**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అద్దెభవనాల్లో సేవలందిస్తున్న 30 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు(యుపిహెచ్‌సిలు) సొంత భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో నూతన భవనానికి రూ. 1 కోటి చొప్పున మొత్తం రూ. 30 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణ పనుల్ని చేపట్టడానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

**సమీక్షానంతర నిర్ణయం :** రాష్ట్రంలో మొత్తం 560 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సేవలందిస్తున్నాయి. వీటి వసతికి సంబంధించిన విషయాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో సమీక్షించి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. మొత్తం 560 కేంద్రాల్లో 175 మునిసిపల్ భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా 2లో...

## ఆశా వర్కర్లకు గ్రాట్యుటీ

**రూ.645 కోట్ల మేరకు లబ్ధిపొందనున్న ఆశాలు**

**దేశంలోనే ఆశాలకు గ్రాట్యుటీ చెల్లిస్తున్న మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్**

**6 నెలల పాటు ప్రసూతి సెలవుల మంజూరు**

**ఒక్కో ప్రసవానికి 6 నెలలు చొప్పున మొదటి 2 ప్రసవాలకు వేతనాలతో కూడిన**

2లో...

## వసతి గృహాలకు రూ. 300 కోట్లు విడుదల

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** సాంఘిక శాఖలో వినూత్న మార్పులు తీసుకువస్తున్నామని, హస్టల్స్ లో తమ పిల్లలను చేర్పించే విద్యార్థుల తల్లితండ్రుల్లో భరోసా కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని సాంఘిక సంక్షేమ, వికలాంగులు మరియు సీనియర్ సిటిజన్ సంక్షేమం, సచివాలయం, గ్రామ వాలంటీర్ల వ్యవహారాల శాఖామాత్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రీజనల్ కాన్ఫరెన్స్ ను మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ వసతి గృహాల మరమత్తుల నిమిత్తం రూ. 143 కోట్లు, నూతనంగా నిర్మించే హస్టల్




భవనాలకు రూ. 100 కోట్లకు పైగా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి దాదాపు రూ. 50 కోట్లు విడుదల చేయడం జరిందన్నారు. మొత్తంగా దాదాపు రూ. 300 కోట్లు హస్టల్స్ కు కేటాయించామని తెలిపారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే వసతుల మెరుగుపై దృష్టి సారించామని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో అహ్లాదకరంగా ఉంటూ చదువుపై దృష్టి నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో నూతనంగా హస్టల్ భవనాలు నిర్మాణాలు చేపడుతున్నామని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో మెనూలో నాణ్యమైన బియ్యం అందిస్తున్నాము. మిగతా 2లో...

## నామినేటెడ్ పోస్టుల నజరానా

**• రాష్ట్రంలో 31 నామినేటెడ్ పోస్టుల భర్తీ - జాబితా ఇదే!**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో నామినేటెడ్ పదవుల పండగ మళ్లీ మొదలైంది. మరికొన్ని నామినేటెడ్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. తాజాగా 31 పదవుల భర్తీకి సంబంధించిన జాబితా విడుదలైంది. ఇప్పటికే పలు దఫాలుగా మార్కెట్ కమిటీలు సహా కొన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసిన విషయం తెలిసిందే. మిగతా 2లో...



## ఏపీకి సెమీ కండక్టర్ ప్రాజెక్టు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలో నాలుగు కొత్త సెమీ కండక్టర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల్లో సెమీ కండక్టర్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. మొత్తంగా రూ. 4594 కోట్ల వ్యయంతో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలియజేశారు. ఏపీలో అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ సంస్థ రూ. 468 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దేశంలో సెమీ కండక్టర్ ఎకో సిస్టమ్ గణనీయంగా ఊపందుకుంటున్న వేళ కేంద్ర కేబినెట్ నిర్ణయం మరింత ప్రయోజనకరంగా మారనుంది. ఇప్పటికే దేశంలో ఆరు సెమీ కండక్టర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. తాజాగా ఆమోదించిన నాలుగు కొత్త ప్రాజెక్టులతో ఈ సంఖ్య మొత్తంగా 10కి చేరింది. తద్వారా 2034 నాటికి నైపుణ్యం కలిగిన వారికి మరింతగా ఉపాధి అవకాశాలు సృష్టించడంలో ఇవి కీలకంగా మారనున్నాయని కేంద్రం తెలిపింది. 2 లో..

## ఉర్దూ భాషకు ప్రోత్సాహం



- "స్వాతంత్ర్య పోరాటంలో ఉర్దూ భాష పాత్ర" పై పోటీలు
- రాష్ట్రంలోని 10వ తరగతి ఉర్దూ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు
- 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా 13,14తేదీలలో నిర్వహణకు ఏర్పాట్లు
- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి మిగతా 2లో...

## ముగిసిన ఉప ఎన్నికలు

**• ముగిసిన జడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ - 14న ఫలితాలు**



**పులివెందుల(జర్నలిస్ట్ ఫైల్ ) :** కొన్నిరోజుల ఉత్కంఠకు తెరపడింది. స్వల్ప ఘటనలు మినహా పులివెందుల, ఒంటిమిట్టలో జడ్పీటీసీ ఉప ఎన్నిక ముగిసింది. కొన్నిచోట్ల తెలుగుదేశం నేతలపై వైఎస్సార్సీపీ శ్రేణులు దాడికి యత్నించగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్నికల్లో ప్రభావితం చేసే అవకాశం ఉన్న నేతలను ముందుస్తుగా గృహనిర్బంధం చేశారు. బ్యాలెట్ బాక్సులను కడపకు తరలించారు.

చెదురుమదురు ఘటనల మధ్య కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలో జడ్పీటీసీ ఉపఎన్నికలు ముగిశాయి. టీడీపీ అభ్యర్థి లతారెడ్డి, వైఎస్సార్సీపీ నుంచి హేమంత్?రెడ్డి సహా 11 మంది పులివెందుల ఉప ఎన్నికలో పోటీ పడ్డారు. ఈ క్రమంలోనే కణంపల్లెలో ఇరు పార్టీల మధ్య స్వల్ప మిగతా 3లో...

## సైనికుల సేవలు మరువలేం



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** మాజీ సైనికోద్యోగులకు డ్రోన్ల వినియోగంతో మరోసారి దేశానికి, సమాజానికి సేవలు అందించే అవకాశం వచ్చిందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని హెూంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సైనిక వెల్ఫేర్ డిపార్ట్ మెంట్, కోరమాండల్ ఇంటర్నేషనల్ మరియు దక్ష డ్రోన్స్ ఆధ్వర్యంలో హెూటల్ మినర్వాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెూంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హెూంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ మాట్లాడుతూ దేశానికి సేవలు అందించిన మాజీ సైనికోద్యోగులు డ్రోన్ల వినియోగంతో మరోసారి సమాజానికి సేవలు అందించే అవకాశం వచ్చిందన్నారు. దీని ద్వారా వాళ్లు ఉపాధి పొందుతూ కొద్దిమందికి స్వయం ఉపాధి అవకాశాలను కూడా కల్పించవచ్చాన్నారు. మిగతా 3లో...



## పోలవరం పరుగులు

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వం ముంచేసిన పోలవరం ప్రాజెక్టు పనులను గాడిలో పెట్టి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు షెడ్యూల్ విడుదల చేశారని, ఆయన విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ప్రాజెక్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. ప్రాజెక్టు పనుల్లో కీలకమైన గ్యాప్-2 డయా ఫ్రంవాల్ ను 1396 మీటర్ల పొడవున నిర్మించాల్సి ఉండగా మంగళవారం నాటికి 500 మీటర్ల పొడవున నిర్మాణ పనులు పూర్తి చేశామని స్పష్టం చేశారు. మూడు ట్రెంచ్ కట్టర్లు, మూడు గ్రాబర్లతో గ్యాప్-2 డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మిగతా 2లో...

# మెరుగైన ఆరోగ్య సేవలు

(మొదటి పేజీ తరువాయి)

మరో 293 సొంత భవనాల్లో పనిచేస్తున్నాయి. నిర్మాణంలో ఉన్న మరో 62 భవనాలు ఈ ఏడాది చివరికి పూర్తవుతాయి. మిగిలిన 30 కేంద్రాలకు సొంత భవనాలను ఏర్పాటు చేసేందుకు రూ. 30 కోట్ల వ్యయానికి మంత్రి ఆమోదం తెలిపారు. ఈ పనులు పూర్తయ్యే సరికి మొత్తం 560 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వ భవనాల నుంచే సేవలందిస్తాయి.

**విశాఖపట్నంలో 4 కొత్త భవనాలు :** మంత్రి ఆమోదంతో రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాల్లో 30 యుపిహెచ్‌సిలకు నూతన భవనాలు నిర్మిస్తారు. ఇందులో విశాఖపట్నం నగరంలో 4 నూతన భవనాల నిర్మాణం జరుగుతుంది. ఏలూరు జిల్లాలో 3(ఏలూరు, జంగారెడ్డి గూడెం, చింతపల్లి), అనంతపురం జిల్లాలో 2(అనంతపురం, గుత్తి), కడప జిల్లాలో 2(కడప, బద్వేల్) చోట్ల కొత్త భవనాల నిర్మాణాన్ని చేపడతారు. వీటితో పాటు బొబ్బిలి, తణుకు, విజయవాడ, గొల్లప్రోలు( కాకినాడ జిల్లా) విజయవాడ,కానూరు, గుంటూరు, చిలకలూరిపేట, పొదిలి, కుప్పంలలో యుపిహెచ్‌సిలకు నూతన సొంత భవనాలు ఏర్పడనున్నాయి.

# ఆశా వర్కర్లకు గ్రాట్యుటీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆశా వర్కర్లకు గ్రాట్యుటీ చెల్లించనున్న దేశంలోని తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 43,000 మంది ఆశాలకు సేవా కాలం ప్రకారం ఏడాదికి రూ. 5,000 చొప్పున, గరిష్టంగా పదవీ విరమణ సమయంలో రూ. 1,50,000 చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో మొత్తం రూ. 645 కోట్లు ఖర్చు కానున్నాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆశాల ప్రధాన డిమాండ్లను అంగీకరించడంతో, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశాల కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సేవా ఉత్సాహాన్ని మరింత పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ ఆమోదంలో భాగంగా ప్రతి ప్రసవానికి ఆరు నెలల చొప్పున, మొదటి రెండు ప్రసవాలకు వేతనాలతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేసింది. అలాగే ఆశా వర్కర్ల పదవీ విరమణ వయసును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచింది. సేవా కాలానికి అనుగుణంగా ఏడాదికి రూ. 5,000 చెల్లింపుతో గరిష్టంగా రూ. 1.5 లక్షల గ్రాట్యుటీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. గ్రామ స్థాయిలో వైద్యారోగ్య పథకాల అమలు మరింత బలపడుతుందని ఉన్నతాధికారులు తెలిపారు.

# వసతి గృహాలకు రూ. 300 కోట్లు విడుదల




(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది నుండి పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు కార్పెట్, టవల్స్, బెడ్ షీట్స్ కూడా అందిస్తున్నామన్నారు. ఇంటర్ లో, పదవ తరగతిలో గణనీయమైన మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించుకున్న విషయం విదితమే అని అన్నారు. మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సత్కరించుకోవడం వల్ల విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం అలవడటంతో పాటు ఉత్తీర్ణత శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయికి చేర్చడానికి రీజనల్ వర్క్ షాపు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్ అందిస్తామన్న నమ్మకం తల్లితండ్రుల్లో కల్పించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. హస్టల్ లో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, మంచి భోజనం ఏర్పాటు చేయాలని, వసతి సౌకర్యాలు బాగుండాలని ఆదేశించారు. రీజనల్ కాన్ఫరెన్స్ ల ఏర్పాటు లో భాగంగా మొదటగా విజయవాడలో, అటుపై విశాఖపట్నం, తిరుపతి లలో కూడా రీజనల్ వర్క్ షాపు లు త్వరలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వర్క్ షాపులో వార్డెన్లు తెలిపిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ ఎంఎం నాయక్, డైరక్టర్ లావణ్య వేణి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్ టీ ఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన హస్టల్ వార్డెన్లు, అధికారులు పాల్గొన్నారు.

# పోలవరం పరుగులు



(మొదటి పేజీ తరువాయి)

ఆయన చెప్పారు. 2025 డిసెంబర్ నాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేసేలా, అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. వరదల సమయంలో సైతం డివాటరింగ్ చేస్తూ శరవేగంగా పనులు జరుగుతున్నాయని, ఎగువ కాఫర్ డ్యాంను బలోపేతం చేసేలా నిర్మిస్తున్న బట్రస్ డ్యాం నిర్మాణ పనులు సైతం 90శాతంకు పైగా పూర్తయ్యాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాన్ని చక్క దిద్దామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొచ్చేలా చురుకుగా పనులు జరుగుతున్నాయని తెలిపారు.

# 'స్త్రీ శక్తి'కి సర్వ సిద్ధం




**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని మహిళలు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్ట్ 15 నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం 'స్త్రీశక్తి' సన్నద్ధతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సమీక్షలో సీఎం అధికారులను ఆదేశించారు. అధిక రద్దీకి అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నిర్వహణ సమర్ధంగా చేయాలని, అందుకు తగ్గట్టు సామర్ధ్యం పెంచుకోవాలని, భద్రత కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని... ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం అమలుకు సంబంధించి ప్రయాణికుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుని, దానికి అనుగుణంగా పథకాన్ని మరింత మెరుగ్గా అమలు పరచాలని సీఎం నిర్దేశించారు. సర్వీస్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా సేవలు అందించేలా చూడాలన్నారు.

**సమస్యలు వెంటనే పరిష్కరించేలా...:** 'ఈపోస్ మిషన్లకు జీపీఎస్ తప్పనిసరిగా ఎనేబుల్ చేసి ట్రాక్ చేయడం ద్వారా ప్రయాణికులకు సమాచారాన్ని అందించాలి. ఆర్టీజీఎస్‌తో అనుసంధానమై పనిచేయాలి. సమస్యలు ఎక్కడైనా ఉత్పన్నమైతే వాటిని వెంటనే పరిష్కరించేలా వ్యవస్థ సిద్ధంగా ఉండాలి. బస్ స్టేషన్లు అత్యంత పరిశుభ్రంగా ఉండాలి. ఎప్పటికప్పుడు చెత్త తొలిగించాలి. టాయిలెట్లను ప్రతి 2 గంటలకు ఒకసారి శుభ్రపరచాలి. దీనిపై ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలి. ప్రయాణికులు ఎక్కడా అసౌకర్యానికి గురి కాకూడదు. అన్ని బస్ స్టేషన్లలో తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. రూ. 30 కోట్లతో చేపట్టిన బస్ స్టేషన్ల మరమ్మతులు, పెయింటింగ్ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కావాలి. అవసరమైన చోట్ల కొత్తగా ఫ్యాన్లు, చైర్లు ఏర్పాటు చేయాలి. ప్యాసింజర్లకు సహకరించేలా 24 గంటలు ఆర్టీసీ సిబ్బంది బస్ స్టేషన్‌లో అందుబాటులో ఉండాలి.

**బ్రేక్ డౌన్‌లు తలెత్తకుండా...:** రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు అదనంగా నడపాల్సి వస్తుండటంతో బస్సులు ఎక్కడా బ్రేక్ డౌన్ కాకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డనరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలు రాష్ట్రమంతా ప్రయాణించవచ్చని వివరించారు. వీరికి జీరో ఫేర్ టిక్కెట్ కోసం ఈపోస్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ ఆగస్ట్ 14కల్లా అప్డేట్ చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయ్యిందని వెల్లడించారు. స్త్రీశక్తి పథకాన్ని ముఖ్యమంత్రి ఈనెల 15న మధ్యాహ్నం విజయవాడలోని పండింట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ప్రారంభిస్తారు. మరోవైపు సమీక్షలో ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు అందించే సాయంపైనా అధికారులతో చర్చించారు. ఆటో డ్రైవర్లకు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలతో కలిపి... కొత్త పథకం రూపొందించేందుకు సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు.

# ఏపీకి సెమీ కండక్టర్ ప్రాజెక్టు



(మొదటి పేజీ తరువాయి)

ఎలక్ట్రానిక్ తయారీ ఎకోసిస్టమ్‌కు ఉత్ప్రేరకంగా పని చేయడం ద్వారా ఇవి పరోక్షంగా అనేక ఉద్యోగాల కల్పనకు దోహదపడతాయని కేంద్రం పేర్కొంది. డేటా సెంటర్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, టెలికాం, ఆటోమోటివ్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్‌లో సెమీకండక్టర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నాలుగింటిని కొత్తగా ఆమోదించామని వివరించింది. నూతన సెమీ కండక్టర్ ప్రాజెక్టులు దేశంలో సాంకేతిక పరిజ్ఞానంలో స్వావలంబన సాధించడంతో పాటు ఆత్మనిర్భర్ భారత్‌ను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని కేంద్రం వెల్లడించింది.

**ప్రధానికి సీఎం కృతజ్ఞతలు:** రాష్ట్రానికి సెమీకండక్టర్ పరిశ్రమ కేటాయించిన ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. చిప్ ప్యాకేజింగ్‌తో బ్యాకెండ్ సెమీకండక్టర్ తయారీ సామర్ధ్యం పెరుగుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఏపీలో పూర్తి ఎలక్ట్రానిక్స్ పర్యావరణ వ్యవస్థను పెంపొందిస్తుందన్నారు.

**మంత్రి నారా లోకేశ్ హర్షం :** ఆంధ్రప్రదేశ్‌కు సెమీ కండక్టర్ల ప్రాజెక్టు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ నేతృత్వంలో సెమీ కండక్టర్ తయారీ ఏపీకి వస్తోందని చెప్పారు. రాష్ట్రానికి ఈ ప్రాజెక్టును మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ దక్షిణ కొరియాకు చెందిన ఏపీఏసీటీ కో లిమిటెడ్‌తో 96 మిలియన్ యూనిట్ల వార్షిక సామర్ధ్యంతో ఒప్పందం కుదుర్చుకుంటుందని తెలిపారు. సెమీకండక్టర్లను మొబైల్స్, సెట్ టాప్ బాక్సులు, ఆటోమొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ అప్లికేషన్స్‌లో ఉపయోగిస్తారని చెప్పారు. తద్వారా ఆత్మనిర్భర భారత్‌కు ఈ ప్రాజెక్టు ఎంతో దోహదం చేస్తుందని లోకేశ్ పేర్కొన్నారు.

నిత్య జీవితంలో వాడే సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎల్‌ఈడీ టీవీలు, వైద్య పరికరాలు, స్మార్ట్ వాహనాలు – ఇవన్నీ సులభంగా పనిచేయడానికి సెమీ కండక్టర్ టెక్నాలజీయే కీలకం. జర్మేనియం, సిలికాన్, గేలియం ఆర్సెనైడ్ వంటి పదార్థాలను సెమీ కండక్టర్‌లుగా ఉపయోగిస్తుంటారు. వీటితో ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ (ఐసీ) లేదా మైక్రోచిప్స్‌ను తయారు చేస్తారు. ఇవి ఎలక్ట్రానిక్ వస్తువులకు మెదడులా పని చేస్తాయి. సాంకేతికత పురోగతిలో సెమీ కండక్టర్ల ప్రాధాన్యం పెరుగుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), నానో టెక్నాలజీ, 5జీ కమ్యూనికేషన్, అంతరిక్ష, రక్షణ పరిశోధనలు, గ్రీన్ హైడ్రోజన్ ఇంధన తయారీ, ఎలక్ట్రిక్ వెహికల్స్ వంటి రంగాల్లో వీటి పాత్ర కీలకంగా మారుతోంది.

# నామినేటెడ్ పోస్టుల నజరానా

(మొదటి పేజీ తరువాయి)

**తాజాగా భర్తీ చేసిన పోస్టుల వివరాలివే:**

రాష్ట్ర షెడ్యూల్డ్ కాస్ట్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ – ఆకేపోగు ప్రభాకర్ (కొడుమూరు–ఎస్సీ) (టీడీపీ)

సామాజిక సంక్షేమ బోర్డు – బాల కోటయ్య (నందిగామ–ఎస్సీ)–(బహుజన జేఏసీ), కమ్మ కార్పొరేషన్ – బ్రహ్మం చౌదరి, గురజాల (టీడీపీ)

బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ – బుచ్చి రాంప్రసాద్, గుంటూరు వెస్ట్ (టీడీపీ)

ముదలియార్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ – సి. ఎస్. త్యాగరాజన్ – చిత్తూరు (టీడీపీ)

బొందిలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ – డి. విక్రమ్ సింగ్, కర్నూలు (టీడీపీ)

హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) – దాసరి శ్రీనివాసులు, తిరుపతి (బీజేపీ)

వడ్డీ అభివృద్ధి కార్పొరేషన్– గుంటసల వెంకట లక్ష్మి, దెందులూరు (జనసేన)

ఆరెకటిక / కటిక / ఆరే – సూర్యవంశీ సంక్షేమ, అభివృద్ధి సంఘం– హరికృష్ణారావు హనుమంతకరి, తాడిపత్రి (టీడీపీ)

విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ – కమ్మరి పార్వతి– పాణ్యం (టీడీపీ)

కుంచిటి వక్కలిగ, వక్కలిగర, కుంచిటిగ సంక్షేమ– అభివృద్ధి సంఘం– లక్ష్మీనారాయణ, మడకశిర (ఎస్సీ) (టీడీపీ)

నగరాలు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ – మరుపిల్ల తిరుమలేశ్వరరావు, విజయవాడ వెస్ట్ (టీడీపీ)

పాల–ఏకరి, ఏకిల, వ్యాకుల, ఏకిరి, నాయనివారు, పాలెగారు, తోలగారి, కవలి సంక్షేమ, అభివృద్ధి సంఘం–నాగేశ్వర నాయుడు కందూరి, రాయచోటి (టీడీపీ)

నూర్‌బాషా/ దూదేకుల కార్పొరేషన్ – నాగుల్ మీరా కాసునూరి, విజయవాడ వెస్ట్ (టీడీపీ)

కురాకుల, పొందర సంక్షేమ, అభివృద్ధి సంఘం – నరసింహులు దామోదర, నరసన్నపేట (టీడీపీ)

వికలాంగులు, వృద్ధ పౌరుల సహాయ కార్పొరేషన్ – నారాయణ స్వామి, రాప్తాడు(టీడీపీ)

కనీస వేతన సలహా బోర్డు– పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, కోవూరు (టీడీపీ)

మాంసం అభివృద్ధి కార్పొరేషన్– ప్రకాశ్ నాయుడు, సింగనమల (ఎస్సీ)–టీడీపీ

తెలుగు, సంస్కృత అకాడమీ– ఆర్. డి. విల్సన్ – నెల్లూరు సిటీ (బీజేపీ)

సగర /ఉప్పర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ – ఆర్. వెంకట రమణప్ప, పెనుకొండ (టీడీపీ)

నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ – రామనారాయణ రావు ఎరుబోతు, విజయవాడ సెంట్రల్ (టీడీపీ)

కళింగ కోమటి/కళింగ వైశ్య సంక్షేమ, అభివృద్ధి సంఘం – రమేష్ మొదలవలస, ఆమదాలవలస (టీడీపీ)

సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ–రవి మందలపు, రాజమహేంద్రవరం సిటీ (టీడీపీ)

వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్ – రెడ్డి అనంత కుమారి, కొత్తపేట (టీడీపీ)

బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్– శ్రీధర్ బొమ్మన, సూళ్లూరుపేట (ఎస్సీ) (టీడీపీ)

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ– షేక్ రియాజ్, ఒంగోలు(జనసేన)

జానపద కళలు&సృజనాత్మకత అకాడమీ – వంపూరు గంగులయ్య, పాడేరు– ఎస్టీ (జనసేన)

వీరశైవ లింగాయత, లింగబలిజ సంక్షేమ అభివృద్ధి సంఘం –స్వప్న, అనంతపురం అర్బన్ (టీడీపీ)

కృష్ణబలిజ /పూసల సహకార ఆర్థిక కార్పొరేషన్ లిమిటెడ్ – త్రిమూర్తులు గంటా, భీమవరం (టీడీపీ)

జంగం సంక్షేమ, అభివృద్ధి సంఘం – వి. చంద్రశేఖర్, పీలేరు(టీడీపీ)

దాసరి సంక్షేమ, అభివృద్ధి సంఘం – వెంకట రత్నాజీ పొట్నూరు– శృంగవరపుకోట (టీడీపీ)

# ఉర్దూ భాషకు ప్రోత్సాహం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** "భారత స్వాతంత్ర్య పోరాటంలో ఉర్దూ భాష పాత్ర" అనే అంశంపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఆగస్టు 15వ తేదీ 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నట్లు మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ఏపీ ఉర్దూ అకాడమీ నేతృత్వంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, విద్యా శాఖల సంయుక్త నిర్వహణలో భారత స్వాతంత్ర పోరాటంలో ఉర్దూ భాష పాత్ర అంశంపై పోటీలను 13,14 వ తేదీలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆయా జిల్లాల మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులను నోడల్ అధికారులుగా నియమించి పర్యవేక్షణకు ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్ర రెండవ అధికారిక భాష ఉర్దూను ప్రోత్సహించడానికి, అభివృద్ధి చేయడానికి మైనారిటీ సంక్షేమ శాఖ అమలు చేస్తున్న కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల నిర్వహణతో భాష అభివృద్ధి చెందడమే కాకుండా, ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులలో దేశభక్తి భావాలు కూడా పెంపొందుతాయని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఆనాటి స్వాతంత్ర ఉద్యమంలో ఉర్దూ భాష పాత్ర పై వ్యాసరచన, వక్తృత్వపోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు మొదటి, రెండవ, మూడవ బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందని మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# బెస్ట్ లివబుల్ సిటీగా అమరావతి

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** కార్డు టైమ్ లో రాజధాని అమరావతి నిర్మాణ పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువు కంటే ఆరు నెలల ముందే పనుల్ని పూర్తి చేసి నగర నిర్మాణం పూర్తవ్వాలని సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రాజధాని నిర్మాణ పనుల పురోగతి సహా, వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులు తదితర అంశాలపై ముఖ్యమంత్రి సీఆర్డీఏ, ఏడీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి పి. నారాయణ, పురపాలక, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులతో పాటు రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ప్రపంచంలో అత్యుత్తమ నివాస నగరంగా అమరావతి నిర్మాణం జరగాలని సీఎం స్పష్టం చేశారు. రాజధానిలో ఎల్పీఎస్ లే అవుట్లలో అభివృద్ధి పనుల పురోగతి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఉద్యోగులు, న్యాయమూర్తుల నివాస భవనాలు, రహదారులు, డక్ట్ లు లాంటి ట్రంక్ ఇన్ఫ్రా, వరద నియంత్రణ పనులు జరుగుతున్న తీరుపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. రాజధానిలో ప్రస్తుతం ప్రస్తుతం రూ. 50,552 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని 74 పనులు ప్రారంభమయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. కాంట్రాక్టు సంస్థలు ఆయా పనుల్ని పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అయితే నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని తేల్చి చెప్పారు. రాజధానిలో చేపడుతున్న నిర్మాణ పనుల ప్రగతి ప్రజలకు కనిపించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ నెలా అమరావతి పనుల పురోగతిపై సమీక్ష చేస్తానని సీఎం అన్నారు. సమయం ప్రకారం పనులు పూర్తి కాకపోతే ఎందుకు కాలేదన్న



అంశంపై సదరు కాంట్రాక్టు సంస్థతో పాటు అధికారులు కూడా బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. దీంతో పాటు రియల్ టైమ్ లో పనుల పురోగతిని కూడా పర్యవేక్షిస్తామని సీఎం స్పష్టం చేశారు. ఆటో పైలట్ మోడ్ లో పనులు జరగాలని సూచించారు.

**రైతులకు ఇబ్బంది లేని రీతిలో ప్లాట్ల బదిలీ :** రిటర్నబుల్ ప్లాట్ల విషయంలో రాజధాని రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ విషయంలో రైతుల విజ్ఞప్తులను పరిశీలించి మాస్టర్ ప్లాన్ కూడా ప్రభావితం కాకుండా ఆయా సమస్యల్ని పరిష్కరించాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి నారాయణ వారం రోజుల్లోగా ఈ అంశాన్ని కొలిక్కి తెస్తామని సీఎంకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రాజధాని పనులు జరగక పోవటంతో నిర్మాణానికి తెచ్చిన ఇనుము, సామాగ్రి తుప్పు పట్టి పోయిందని కాంట్రాక్టర్లు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. నిర్మాణం కోసం సేకరించిన ఇసుక నిల్వల్ని కూడా గత పాలకులు ఎత్తుకెళ్లారని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ఇసుకను భర్తీ చేయాల్సిందిగా మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

**భూములిచ్చిన సంస్థలకు వేగంగా అనుమతులు :** రాజధాని అమరావతిలో కార్యాలయాల నిర్మాణాలు చేపట్టనున్న వివిధ సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. బిట్స్ పిలానీ, ఎక్స్ ఎల్ఆర్ఐ తదితర సంస్థలకు త్వరితగతిన భూమిని కేటాయించాలని సూచించారు. అలాగే ఇప్పటి వరకూ రాజధాని ప్రాంతంలో భూములిచ్చిన 72 సంస్థలు ఏమేరకు నిర్మాణాలు చేపడుతున్నాయో నిరంతరం పర్యవేక్షించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సంస్థలకు స్థలం ఇచ్చేస్తేనే పని పూర్తి కాదని వీటికి అనుసంధానంగా పెట్టుబడులు, వెంచర్లు కూడా రావాలన్నారు. ఒక్కో ఇటుకా పేరిస్తేనే రాజధాని నిర్మాణం పూర్తి అవుతుందని సీఎం అన్నారు. రాజధాని నగరంలో పెట్టుబడులతో పాటు నగరాభివృద్ధి కూడా జరిగేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. పెద్ద ప్రాజెక్టులను సీబీఎన్ మాత్రమే సమర్ధంగా చేయగలుగుతారని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి గడ్కరీ కూడా చెప్పారని.. ఈ క్రెడిబిలిటికి నష్టం కలగకుండా చూడాలన్నారు. అమరావతిలో స్పోర్ట్ సిటీ, పర్యాటక ప్రాజెక్టులు, ఎయిర్ పోర్ట్, బయోటెక్నాలజీ, విద్యాసంస్థలు, ఆస్పత్రులు ఇలా వివిధ రంగాల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు.

**ఎకానమీ, ఎంప్లాయిబిలిటీ, లివబులిటీ లక్ష్యం :** కేవలం భవనాల అభివృద్ధితో మాత్రమే రాజధాని నగరం పూర్తి కాదని ఆర్థిక కార్యకలాపాలు కూడా పెద్ద ఎత్తున రావాల్సి ఉందని తెలిపారు. నిర్మాణాలను పూర్తి చేసి రాజధాని నగరంగా విజిబిలిటీ వస్తే పెట్టుబడిదారులు వచ్చి ఆర్థికంగా పరిపుష్టం అవుతుందన్నారు. తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగటంతో పాటు నివాస యోగ్యమైన నగరంగా అమరావతి మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నాలెడ్జి ఎకానమీ, స్టార్టప్స్ లాంటి ఎకోసిస్టం కూడా రాజధాని నగరంలో కల్పించాలని సూచించారు. దేశంలోని అత్యుత్తమ పది రియల్ ఎస్టేట్ కంపెనీలను కూడా ఆహ్వానించి ఇక్కడ ప్రాజెక్టులు చేపట్టేందుకు అవకాశం కల్పించాలని సీఎం పేర్కోన్నారు. రాజధాని నగరాన్ని గ్రీన్ ఎనర్జీ కారిడార్ గా మార్చేందుకు ఈవీ వాహనాలను ప్రోత్సహించాలన్నారు. సీడ్ కేపిటల్,క్యాపిటల్ సిటీ, కేపిటల్ ఏరియా ప్రాంతాల్లో గాలి నాణ్యత ఎలా ఉందో కూడా నమోదు చేసి వివరాలు ప్రదర్శించాలని అధికారులకు సూచించారు.

## ఆగష్టు 15 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపిని వచ్చే ఏడాది జూన్ 5 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యం. దానిలో భాగంగా ఈనెల 15వ తేదీన నుండి ఎపి సచివాలయంలో " సే నో సింగిల్ యూజ్ ప్లాస్టిక్" నినాదంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి మరీ ముఖ్యంగా మానవాళికి కలుగుతున్న నష్టం వర్ణణాతీతం. ఈనేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టడం జరిగింది. దానిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన రాష్ట్ర సచివాలయం నుండే ముందుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ద్వారా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేందుకు శ్రీకారం చుట్టనున్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివిధ శాఖల కార్యదర్శులతో సమావేశమై చర్చిస్తున్నారు. ఆగష్టు 15 నుండి ఎపి సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కార్యదర్శులతో సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా పర్యావరణానికి హాని కలిగిస్తున్న ఒకసారి వాడి పడేసే వివిధ క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ మంచినీటి సీసాలు, గ్లాసులు, ప్లేట్లు, కప్పులు, స్పూన్లు, పోర్కులు, ఫినాయిల్ సీసాలు, డబ్బాలు తదితర వస్తువులను పూర్తిగా నిషేధించే ఇందుకు తీసుకోవాల్సిన అంశాలపై సిఎస్ విజయానంద్ చర్చిస్తున్నారు.


ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్, ఎంఏయుడి ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, పిసిబి చైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ కుమార్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఆర్పి సిసోడియా, కృష్ణబాబు, సిసిఎల్ఏ జయలక్ష్మి, జిఏడి ముఖ్య కార్యదర్శి ఎంకె మీనా, సిఆర్డిఏ కమీషనర్ కె.కన్నబాబు, ముఖ్య కార్యదర్శి సునీత, కార్యదర్శులు తదితరులు వర్చువల్ గా పాల్గొన్నారు.


## నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల కరస్పాండెంట్ డియల్ రవీంద్రారెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ కే వల్లి ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థి విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన కొరకై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది చేత నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ వారిచే మ్రింగించారు ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ముడియం గురు స్వప్న మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తీసుకోవాలని నులిపురుగుల ద్వారా వ్యక్తులలో ఎదుగుదలలో ఆటంకం ఏర్పడడం అధిక రక్తహీనత ఆకలి మందగించడం శరీరం నీరసం ఆందోళన కలగడం అధిక విరోచనాలు వాంతులు కావడం జరుగుతుందని సరైన అభివృద్ధి జరగదని ఇవి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చేతులు గోళ్లను శుభ్రం చేసుకోవడం స్వచ్ఛమైన శుభ్రంగా ఉన్న మంచినీటిని సేవించడం శుభ్రంగా ఉన్న ఆహారం సేవించడం ఆహారాన్ని ఎప్పుడు కప్పి ఉంచడం కూరగాయలను ఆకుకూరలను శుభ్రమైన నీటితో శుభ్రం చేసి వాడడం మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బయట ప్రదేశాల్లో తిరిగే సమయంలో పాదాలకు సురక్షితమైనటువంటి చెప్పులను వేసుకోవడం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మి నరసమ్మ కళాశాల అధ్యాపకులు బాలసుబ్బయ్య శారద వీరలక్ష్మి విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్బెండజోల్ తో "నులి"మేద్దాం





**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** చిన్నారుల లో నులి పురుగులు పేగుల నుండి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులు వీటి భారిన పడకుండా చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవడం వలన కడుపులో నులి పురుగులను నిర్మూలించవచ్చని కాకుమాను ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డా.స్వర్ణ.రాజశేఖర్ తెలిపారు. నులి పురుగులు వలన కలిగే అనర్థాలు మరియు వాటి నివారణకు చేపట్టవలసిన కార్యాచరణ గూర్చి వైద్యాధికారి డా.స్వర్ణ.రాజశేఖర్ తెలియజేశారు.

**నులి పురుగులు వాటి వలన కలిగే అనర్థాలు :** చిన్నారులకు నులి పురుగులు వలన రక్త హీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపు నొప్పి, అలసట, వికారం, విరోచనాలు, బరువు తగ్గడం, వంటి లక్షణాలు ఉంటాయన్నారు.

**వ్యాప్తి చెందుటకు కారణాలు :** నులి పురుగులు ప్రధానంగా అపరిశుభ్రత వలన వ్యాప్తి చెందుతాయి. కలుషితమైన ఆహారం లేదా నిరు త్రాగడం. ఈగలు వాలిన, దుమ్ము పడిన పదార్థాలు తినడం, శుభ్రం చేయని ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తినడం. అపరిశుభ్రమైన వాతావరణంలో ఆడుకోవడం .చేతులు కడగకుండ భోజనం చేయడం. వంటి వాటి వలన నులి పురుగులు వ్యాప్తి చెందుతాయనన్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు :** తల్లి తండ్రులు చిన్నారులకు ఎల్లపుడూ వ్యక్తి గత పరిశుభ్రత గూర్చి అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. అపరిశుభ్రమైన వాతావరణం లో తిరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నులి పురుగులు నివారణ కొరకు వైద్య శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మాత్ర తీసుకున్న ఒకటి, రెండు రోజులలో మల విసర్జన ద్వారా నులి పురుగులు బయటకు వస్తాయన్నారు.

**అల్బెండజోల్ మాత్రల ఉపయోగాలు :** మాత్రలు వేసుకోవడం వలన చిన్నారుల లో రక్త హీనత నియంత్రించబడుతుంది, పిల్లల ఎదుగుదల, బరువు పెరుగుదలకు తోడ్పాడుతుందన్నారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. చిన్నారుల లోనులి పురుగులు లేని బాల్యాన్ని అందించాలన్నారు. తమ వైద్య శాఖ తరుపున పి హెచ్ సి పరిదిలో నూరు శాతం మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం నాడు పి హెచ్ సి పరిదిలో గల పాఠశాలలో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశామని మిగిలి ఉన్న చిన్నారులకు కూడా వైద్య సిబ్బంది చే మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు.

# విజన్‌తోనే అభివృద్ధి వెలుగులు

(మొదటి పేజీ తరువాయి)





కేటాయించిన నియోజకవర్గాల అభివృద్ధికి ప్రాధాన్యతాంశాలను గుర్తించాలి. స్థానికంగా ఉండే ఎమ్మెల్యే సహా మిగిలిన వారితో సంప్రదింపులు జరిపి నియోజకవర్గాల అభివృద్ధికి కచ్చితంగా ప్లానింగ్ చేసుకోవాలి. నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికకు అనుగుణంగా పనిచేస్తే... సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజలకు ఏది మంచిదో చెప్పాలి.. సరైన విధానాలు అవలంభించకపోతే ఎలాంటి పరిణామాలు వస్తాయో ప్రజలకు యంగ్ ప్రొఫెషనల్స్ వివరించాలి. ఎక్కడెక్కడ ఏయే సమస్యలు వస్తాయనే అంశంపైనా ముందుగా అంచనాలు వేయగలగాలి. ఈ ఏడాది వంర్షపాతం చాలా తక్కువగా ఉంది.. అయినా ముందు చూపుతో నీటిని సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లను నింపాం. రికార్డు సమయంలో హంద్రీ-నీవా కాల్వల వెడల్పు పనులు పూర్తి చేసి.. నీటిని విడుదల చేశాం. ఫలితంగా రాయలసీమ సహా అన్ని ప్రాజెక్టుల్లో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. రాష్ట్రంలోని మొత్తం ప్రాజెక్టులకున్న కెపాసిటీలో 80 శాతం మేర నీటిని నిల్వ చేసుకోగలిగాం. దీని వల్ల భూగర్భ జలాలు పెరిగాయి." అని సీఎం చెప్పారు.

**నియోజకవర్గ బలాలను గుర్తించండి :** "ప్రతి నియోజకవర్గానికీ ఓ బలం ఉంటుంది. అభివృద్ధికి దోహదపడే సహజ వనరులు ఉంటాయి. అలాంటి వాటిని యంగ్ ప్రొఫెషనల్స్ గుర్తించి.. అధ్యయనం చేయాలి. ఆ వనరుల ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కావాల్సిన చర్యలన్నీ మేం చేపడుతున్నాం. రాష్ట్రంలోని రోడ్ల నిర్మాణం కోసం పెద్ద ఎత్తున ఖర్చు పెడుతున్నాం.. పాత్ హోల్స్ నిమిత్తమే రూ.1000 కోట్లు ఖర్చు పెట్టాం. జాతీయ రహదారులను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నాం.. ఏపీలో రోడ్లు అమెరికా స్థాయిలో ఉంటాయని నితిన్ గడ్కరీ చూడా చెప్పారు. విద్యుత్ రంగంలో గ్రీన్ ఎనర్జీకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. టెక్నాలజీని అన్ని రంగాల్లో వినియోగించుకుంటున్నాం. రాష్ట్ర సమగ్ర, సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాం. ఇలా జరుగుతున్న అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమాలను యంగ్ ప్రొఫెషనల్స్ నిరంతరం చూసుకుంటూ ఉండాలి. యంగ్ ప్రొఫెషనల్సుకు ఇదో అద్భుతమైన అవకాశం.. మంచి అనుభవం కూడా వస్తుంది. ఇన్నాళ్లు సీఎంగా పని చేసిన నాకు ఎంత అనుభవం వచ్చిందో... మీకూ అంతే అనుభవం వస్తుంది. యంగ్ ప్రొఫెషనల్స్ గా విధులు చేరాక.. ఇబ్బందులూ ఎదురవుతాయి.. ప్రజాప్రతినిధులను అధికారులను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి.

సరైన సమాచారం మీ దగ్గర లేకుంటే.. మిమ్మల్ని పరిగణనలోకి తీసుకోరు. అందుకే ప్రతి అంశాన్ని అధ్యయనం చేయండి.. అప్డేట్ అవ్వండి. మిమ్మల్ని మీరు నిరూపించుకునేందుకు... అభివృద్ధి కోసం మీరు చేసే ఆలోచనలను అమలు చేయడానికి ఆకాశమే హద్దు అని యంగ్ ప్రొఫెషనల్స్ గుర్తించాలి." అని ముఖ్యమంత్రి అన్నారు.

**మనసు పెట్టి పని చేయండి... విజయం మీతోనే ఉంటుంది :** "ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉండాలి. వినూత్నంగా ఆలోచనలు చేయాలి. ఏదో ఉద్యోగం మాదిరిగా విధులు నిర్వహించవద్దు. మనసు పెట్టి పనిచేస్తే మీకూ ఉపయోగం... నియోజకవర్గానికి ఉపయోగం. 1995లో సంస్కరణలు వచ్చినప్పుడు నేర్చుకుని.. తెలుసుకుని.. అధ్యయనం చేసి.. మనకు అన్వయించుకున్నాం కాబట్టే అభివృద్ధి సాధించగలిగాం. ప్రపంచంలో తెలుగు వారికి ప్రత్యేక స్థానం ఉండేలా చేయగలిగాం. అప్పట్లో సంస్కరణల గురించి మాట్లాడితేనే.. పేదలకు వ్యతిరేకమనే భావన ఉండేది. కానీ సంపద సృష్టిస్తే సంక్షేమం చేసి పేదలకు పంచవచ్చని నమ్మి సంస్కరణలు అమలు చేశాం. విజన్ అంటే ఏమిటో ఇప్పుడు కొందరికి అర్థమవుతోంది.. నేను విజన్ 2020 పెట్టినప్పుడు చాలా మంది విమర్శించారు. నేను రూపొందించిన విజన్ 2020 హైదరాబాద్ విషయంలో 100 శాతం నిజమైంది. సంపద సృష్టి చేయడమే కాకుండా.. పేదలకు ఎంత వరకు లబ్ధి చేకూర్చగలిగామనేది కూడా విజన్ డాక్యుమెంటులో భాగమే. ప్రభుత్వం అప్పచెప్పిన బాధ్యత కొత్తగా ఉందని.. ఒత్తిడిగా ఉందని యంగ్ ప్రొఫెషనల్స్ భావించకూడదు. కష్టంతో కాకుండా.. ఇష్టంతో పని చేయండి. నియోజకవర్గంలో 9 మంది సభ్యులతో కలిసి యంగ్ ప్రొఫెషనల్స్ పని చేయాలి.. అందర్నీ సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. క్షేత్రస్థాయికి వెళ్లిన యంగ్ ప్రొఫెషనల్స్ ప్రభుత్వానికి.. నాకూ బలంగా ఉండాలి. మీ సత్తా ఏంటో నిరూపించాలి.

సీఎం మంచి వాళ్లను తమ నియోజకవర్గానికి పంపించారని ప్రతి ఒక్కరూ అనుకోవాలి. మీరు మంచి పేరు తెచ్చుకోండి.. నాకూ మంచి పేరు తీసుకురండి. ఇవాళే ఓ డెవలప్మెంట్ జరిగింది. ఏపీకి సెమీకండక్టర్ యూనిట్ ను కేంద్రం కేటాయించింది. ఇది మంచి పరిణామం. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ ఎకో సిస్టం ఏర్పడడానికి కేంద్రం తీసుకున్న నిర్ణయం దొహదపడుంది." అని సీఎం చంద్రబాబు చెప్పారు. శిక్షణ ముగించుకున్న 175 యంగ్ ప్రొఫెషనల్స్ కు ప్రణాళిక శాఖ నియామక పత్రాలు అందచేసింది. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, పీ4 ఫౌండేషన్ వైఎస్ ఛైర్మన్ కుటుంబరావు, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన ఉప ఎన్నికలు



(మొదటి పేజీ తరువాయి)

ఘర్షణ తలెత్తింది. ఓటు వేసేందుకు వెళ్తున్న టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్సీపీ శ్రేణులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం శ్రేణుల కారు అద్దాలు ధ్వంసం చేయగా టీడీపీ కార్యకర్తలు ప్రతిఘటించారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

జడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్న సమయంలో వైఎస్సార్సీపీ నేతలు హంగామా సృష్టించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఓటర్లను ప్రలోభపెట్టకుండా పోలీసులు కొందరు వైఎస్సార్సీపీ, టీడీపీ నాయకులను ముందస్తు అరెస్టలు, గృహనిర్బంధాలు చేశారు. వేంపల్లిలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి సతీష్‌రెడ్డిని గృహనిర్బంధించారు. పులివెందులలో తెలుగుదేశం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ముందస్తు అరెస్ట్ చేసి ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఓటమి భయంతోనే వైఎస్సార్సీపీ నేతలు హంగామా సృష్టించారని టీడీపీ అభ్యర్థి లతారెడ్డి అన్నారు. తమ శ్రేణులు శాంతియుతంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. అయితే వైఎస్సార్సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి అరెస్ట విషయంలో హైడ్రామా నెలకొంది. ఆయణ్ని అరెస్ట్ చేసి కడపకు తీసుకెళ్తుండగా ఎర్రగుంట్ల వద్ద ఆ పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆయన పోలీసు వాహనం నుంచి బలవంతంగా కిందకు దిగి బైఠాయించి నిరసన తెలిపారు. ఇదే అదనుగా పోలీసుల కళ్లుగప్పిన అవినాష్‌రెడ్డి పులివెందులకు పరారయ్యారు. విషయం తెలుసుకున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అశోక్‌కుమార్ పులివెందుల వైఎస్సార్సీపీ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఆయణ్ని అదుపులోకి తీసుకున్నారు. ఎంపీ తీరుపై పోలీసులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు వైఎస్సార్సీపీ శ్రేణులను ఉద్దేశించిన అవినాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. జరగాల్సిన నష్టం జరిగిపోయిందని టీడీపీ, పోలీసులు ఇద్దరూ ఒకటేనని అన్నారు ఇద్దరితోనూ మనం పోరాటం చేయాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు.

ఒంటిమిట్టలో జడ్పీటీసీ ఉప ఎన్నిక చెదురుమదురు ఘటనల మధ్య ముగిసింది. ఇక్కడ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి, వైఎస్సార్సీపీ నుంచి ఇరగం రెడ్డి సహా 11 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. చింతరాజుపల్లె, కొత్తపల్లి, మంటపం పల్లె, సలాబదు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఏజెంట్లపై వైఎస్సార్సీపీ ఏజెంట్లు, నాయకులు జులుం ప్రదర్శించడం ఉద్రిక్తతకు దారితీసింది. అక్కడకు చేరుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్?రెడ్డి ఎదుటే వైఎస్సార్సీపీ నేతలు హంగామా చేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు.

ఒంటిమిట్ట జడ్పీ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ కేంద్రంలోకి వైఎస్సార్సీపీ నేతలు చొచ్చుకెళ్లారు. ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు, కర్రలు తోసేసి లోపలికెళ్లి హంగామా సృష్టించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బలగాలను మోహరించారు. మొత్తానికి స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ రెండు ప్రాంతాల్లోని ఉప ఎన్నికకూ ఈనెల 14న కౌంటింగ్ జరగనుంది.

## సైనికుల సేవలు మరువలేం




(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రప్రభుత్వంలో సైనిక్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉందని, మాజీ సైనికోద్యోగులకు ఎంతో సేవలు అందిస్తుందన్నారు. అంతేకాకుండా వారికి ఇంకా ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనాఉందన్నారు. దేశ రక్షణకు పాటుపడిన వారికి ఎన్ని అవకాశాలు కల్పించినా తక్కువేనన్నారు. డ్రోన్ల వినియోగంలో కోరమాండల్ కల్పిస్తున్న అవకాశాలను వారు ఉపయోగించుకోవాలని, ఇది ఆరంభం మాత్రమేనన్నారు. కోరమాండల్ కంపెనీ, మాజీ సైనికోద్యోగులు ఇద్దరూ దీన్ని ఉపయోగించుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధారిత రాష్ట్రమని రైతులు ఎరువులు, పురుగు మందుల వినియోగానికి డ్రోన్ల ద్వారా స్ప్రే చేయడంతో తక్కువ సమయంలో పని పూర్తి చేయవచ్చన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని వివిధ రంగాల్లో పునర్ నిర్మిస్తున్నామన్నారు. డ్రోన్ల వినియోగంతో అటు కంపెనీకి, ఇటు మాజీ సైనికోద్యోగులకు కూడా మంచి జరుగుతుందన్నారు.

రాష్ట్ర సైనిక వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ అతి త్వరలోనే సైనిక వెల్ఫేర్ డిపార్ట్ మెంటులో ఖాళీలను భర్తీ చేయనున్నారన్నారు. మన డిపార్ట్ మెంట్ కు సంబంధించిన విషయాలు హోమ్ శాఖకు వెళ్లిన వెంటనే హోంశాఖ కార్యదర్శి స్పందిస్తూ పూర్తిచేస్తున్నారన్నారు. మాజీ సైనికోద్యోగులు పిల్లలను పోషించే సమయంలో పెన్షన్ పై జీవితాన్ని నెట్టుకొస్తున్నారని, ఎక్కువ మంది 35 సంవత్సరాల వయస్సుకే దేశం కోసం సర్వీసు నుంచి డిశ్చార్జి చేస్తున్నారన్నారు. వేరే ఆదాయం పెంచుకునేలా చూసుకోవాల్సిన అవసరం మాజీ సైనికోద్యోగులకు ఏర్పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం వీరిపై ఉందన్నారు. కోరమాండల్ కంపెనీ ఆధ్వర్యంలో దక్ష డ్రోన్స్ ఉచిత శిక్షణ తీసుకుని మరోసారి దేశానికి, రాష్ట్రానికి సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్స్ ను వ్యవసాయ రంగంలోనే కాకుండా ఎన్నో విధాలుగా ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు.

దక్ష డ్రోన్స్ సీఈవో సమీర్ సచిదానంద మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో డ్రోన్ల ద్వారా ఆధునిక వ్యవసాయం చేయడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. మాకు ఇక్కడ అవకాశం కల్పించారని దాన్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు. ఆరెంటియస్ టెక్ సర్వీసెస్ ఎండీ ఆదిత్య మనోహర్ మాట్లాడుతూ డ్రోన్ల టెక్నాలజీలో మెలుకువలను ఉపయోగించే పద్ధతులను మాజీ సైనికోద్యోగులకు అందిస్తామన్నారు. స్వాగతోపన్యాసం చేసిన సీవోవో కె. శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ డ్రోన్ ల గురించి అవగాహన కల్పించటం, ఔత్సాహికులకు అన్ని విధాలుగా సహకరించే అగ్రగామి సంస్థ ఆరెంటియస్ టెక్ సర్వీసెస్ అని వివరించారు.


కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ పి. సత్యప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి డా. కె. కళ్యాణ వీణ, మాజీ సైనికోద్యోగులు, తదితరలు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో మండల అభివృద్ధి సాధ్యం



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలు సమిష్టి కృషి తోనే మండల అభివృద్ధి సాధ్యం అవుతుందని ఎంపీపీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. కాకుమాను మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా జడ్పీటీసీ గుల్జార్ బేగం మాట్లాడుతూ అధికారులు అందరూ కూడా అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించి అమలు పరచాలని కోరారు. తహసిల్దార్ బి.వెంకట స్వామి రెవెన్యూ శాఖ తరుపున అందిస్తున్న సేవలు గూర్చి తెలియజేశారు. ఎంపిడిఓ కే యుగ కీర్తి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులతో రాబోయే కాలంలో మండల అభివృద్ధి కొరకు చేపట్టవలసిన కార్యాచరణ గూర్చి ప్రణాళికలను తయారుచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా పలు శాఖల అధికారులు వారి శాఖల తరుపున అందిస్తున్న సేవలు చేపట్టబోయే కార్యాచరణ ల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమం లో భాగంగా పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ మండలంలో పొగాకు కొనుగోలు కేంద్రం గౌడన్ నిండుకుంటే మిగిలి ఉన్న రైతుల పరిస్థితి ఏంటని అడిగారు. అదే విధంగా చినలింగాయపాలెం లో రైతులకు అర కట్ట మాత్రమే ఎరువు ఇస్తున్నారని తెలిపారు. సాగుకు సరిపడ ఎరువులను అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భముగా మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ పుల్లడిగుంట వద్ద మరొక గోడౌన్ ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎరువులు కూడా పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టి కి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలు శాఖల అధికారులు ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు అయినారు. గత సర్వ సభ్య సమావేశానికి కూడా పలు శాఖల సిబ్బంది గైర్హాజరు అయిన సందర్భాలు ఉన్నాయి. రానున్న సర్వ సభ్య సమావేశానికి అయిన పూర్తి స్థాయిలో అధికారులు హాజరయ్యే విధంగా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతి నిధులు కోరుతున్నారు. ఈ కార్యక్రమం లో ఎం ఈ ఓ లు కెన్నెడీ, విజయ భాస్కర్, ఉప ఎంపీపీ లు వెంకట రెడ్డి , కపిల్, సీడీపీవో విజయ లక్ష్మి , ఏ పి ఎం సుజాత, ఏ పి ఓ సుభాషిణి, పి ఆర్ ఎ ఈ రవీంద్ర రెడ్డి, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్ధులకు మాత్రల పంపిణీ



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** నులి పురుగులు నివారణ కార్యక్రమం లో భాగంగా కాకుమాను మండల పరిదిలో గల పాఠశాలలో విద్యార్ధులకు నులి పురుగులు నివారణ కొరకు మాత్రలను వైద్యాధికారి డా.స్వర్ణ.రాజశేఖర్ ఆధ్వర్యంలో వైద్య శాఖ సిబ్బంది పంపిణీ చేశారు. కాకుమాను ఎన్ జడ్పీ హై స్కూల్ నందు జరిగిన కార్యక్రమం లో పలువురు మండల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ బి.వెంకట స్వామి మాట్లాడుతూ నులి పురుగులు నివారణ కొరకు అందిస్తున్న అల్బెండజోల్ మాత్రలను ప్రతి ఒక్క చిన్నారి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. దీని ద్వారా ఆరోగ్యం గా ఉంటారని తెలిపారు. ఎంపిడిఓ కే.యుగ కీర్తి మాట్లాడుతూ విద్యార్ధులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలి సూచించారు. అపరిశుభ్రమైన వాతావరణం వలన చిన్నారులకు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటాయని వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మండల రెండవ విద్యా శాఖ అధికారి కే.విజయ భాస్కర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు వారి ఆరోగ్యం బావుంటేనే భవిష్యత్ లో విద్యార్ధులు అన్నీ రంగాలలో రానిస్తారాన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ ప్లాట్ల వేలంకు అనూహ్య స్పందన
# రాజీవ్ స్వగృహాకు రూ.105 కోట్ల ఆదాయం

**హైదరాబాద్,ఆగస్టు 12(జర్నలిస్ట్‌ఫైల్):** రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్వహించిన ఓపెన్ ప్లాట్ల వేలానికి విశేష స్పందన లభించింది. హైదరాబాద్ శివారు ప్రాంతమైన తొర్రూరులో నిర్వహించిన వేలంలో 100 ప్లాట్లను వేలం వేయగా చదరపు గజం రూ.65,700 వరకు పలికింది. ఈ వేలం ద్వారా కార్పొరేషన్‌కు రూ.105 కోట్ల ఆదాయం వచ్చింది.గతంలో బహదూర్‌పల్లిలో నిర్వహించిన వేలంలో కూడా మంచి స్పందన వచ్చింది. హైదరాబాద్‌లో సొంతింటి కలను సాకారం చేసుకోవాలనుకునేవారు ప్లాట్ల కోసం పోటీ పడుతున్నారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని తొర్రూర్ ప్రాంతంలో వేలం నిర్వహించగా పలువురు ప్లాట్ల కోసం పోటీ పడ్డారు. ఒక్కో ప్లాట్ 300 నుంచి 450 చదరపు గజాల విస్తీర్ణం చొప్పున మొత్తం 100 ఓపెన్ ప్లాట్లు వేలానికి వచ్చాయి. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ చదరపు గజానికి రూ.25,000 కనీస ధరను నిర్ణయించింది. ఈ వేలంలో ప్లాట్లకు అంచనా వేసిన దానికంటే ఎక్కువ ధరలు వచ్చాయి.ముఖ్యంగా కార్నర్ ప్లాట్లకు అత్యధిక ధర పలికింది. తొర్రూరు ప్లాట్లలో అత్యధికంగా ఒక చదరపు గజం ధర రూ.65,700 పలికింది. మొత్తం 24 కార్నర్ ప్లాట్లలో ఒక్కో గజం రూ.67,500 వరకు పలికింది. 100 ప్లాట్ల సగటు ధర గజానికి రూ.33,000గా పలికినట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం ప్రక్రియలో 240 మంది బిడ్డర్లు పాల్గొన్నారని తెలిపారు. ఇటీవల మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బహదూర్‌పల్లి ప్రాంతంలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఓపెన్ ప్లాట్లకు వేలం నిర్వహించింది. 68 ప్లాట్లలో 50 ప్లాట్లను వేలంలో విక్రయించారు. కార్నర్ ప్లాట్లకు చదరపు గజానికి రూ.30 వేలు, ఇతర ప్లాట్లకు రూ.27 వేలు కనీస ధరగా నిర్ణయించారు. వేలంలో గరిష్ఠంగా చదరపు గజానికి రూ.46,500 ధర పలికింది. ఈ వేలం ద్వారా దాదాపు రూ.100కోట్ల ఆదాయం వచ్చింది. నాగోల్ సమీపంలోని బండ్లగూడలో 159 ప్లాట్లు, పోచారం సమీపంలోని 601 ప్లాట్లు వేలం ద్వారా విక్రయించారు. ఈ వేలం ద్వారా మొత్తం రూ.78 కోట్ల ఆదాయం వచ్చింది.

# క్రాప్ లోన్లకు సిబిల్ స్కోర్

## 650 పాయింట్లకే పంట రుణం
## మూడేళ్ల రికవరీ ట్రాక్ తప్పనిసరి
## రైతులకు మంజూరు కాని లోన్లు

**హైదరాబాద్, ఆగస్టు 12(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతోంది. పంటల పెట్టుబడులకు అవసరమైన రుణాల కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. నిబంధనల పేరుతో కొర్రి వేసి రుణాలు ఇవ్వకుండా బ్యాంకులను రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పంట రుణాలను మంజూరు చేయాలంటే సిబిఎల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇండియా లిమిటెడ్ (సిఐబిఐఎల్) స్కోరు తప్పని సరిగా ఉండాలని స్పష్టం చేస్తున్నాయి. అందులో మంచి పాయింట్లు ఉంటేనే పంట రుణాలు ఇస్తామని పలు బ్యాంకులు రైతాంగాన్ని ఇబ్బం దులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్త తున్నాయి. ఆర్‌బీఐ నిబంధన పేరుతో పంట రుణాలకు సైతం సిబిల్ స్కోర్‌ను బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటున్నాయి. సిబిల్ స్కోర్ కనీసం 650 నుండి 700 పాయింట్లు ఉంటేనే రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకు అధికా రులు చెబుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ సిబిల్ స్కోర్‌తో ప్రధానంగా చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులు పంట రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా రుణాల రికవరీలో మూడేళ్ల ట్రాక్ రికార్డ్ చూస్తు న్నామని, ఆ రికార్డు సరిగా ఉంటే రైతులకు సిబిల్ స్కోర్ తక్కువఉన్నా రుణాలు ఇస్తున్నామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. గత రుణాల చెల్లింపుల్లో ఒకటి, రెండు నెలల వ్యత్యాసం ఉన్నా రుణాలు మంజూరు చేస్తున్నామని పేర్కొంటు న్నారు. అయితే చిన్న, సన్నకారు రైతులు చాలా మందికి ట్రాక్ రికార్డు ఉండడం లేదు. 2014లో రాష్ట్రవిభజన తర్వాత రాష్ట్రంలో రుణమాఫీ పథకం దశలవారీగా అమలు చేయడంతో పంటరుణాలు పొందిన రైతులందరికీ రుణాల మాఫీకి ఐదేళ్ల సమయం పట్టింది. అదేవిధంగా వడ్డీల భారమూ ఎక్కువైంది.

దీంతో పలువురు చిన్న, సన్నకారు రైతులు వడ్డీలు చెల్లించలేక, రుణాలు రెన్యువల్ కూడా చేయిం చుకోలేకపోయారు. దీంతో ఫెనాల్టీలు కలుపుతూ వచ్చిన బ్యాంకర్లు ఆ రైతుల ఖాతాలను డీఫాల్టర్ కింద, నిరర్థక ఆస్తుల కింద ప్రకటించారు. దీంతో ఇటీవల జరిగిన రుణమాఫీ పథకంలో సైతం ఈ రైతులపేర్లను జాబితాల్లో చేర్చకపోవడంతో వారం తా రుణమాఫీ పథకానికి దూరమయ్యారు. అదే విధంగా ఈఏడాది అమలైన రుణమాఫీ పథకం సైతం విడతల వారీగా కొనసాగడంతో రైతులంతా సకాలంలో వడ్డీగానీ,అసలుగానీ చెల్లించలేదు. దీంతో రుణఖాతాల రెన్యూవల్ నిలిచిపోయింది. గత ఏడాది వరకు ఏటా రుణాలు చెల్లించిన రైతులు సైతం రుణమాఫీ జమయ్యాక బ్యాలెన్స్ ఉంటే చెల్లిద్దామనే ఆలోచనతో వేచి ఉండడంతో వారందరి సిబిల్ స్కోర్ పడి పోయింది.

దీంతో లక్ష లాదిమందిచిన్న,సన్నకారు రైతులు పంటరుణాలు పొందడానికి అనర్హులుగాతేలారు. బంగారం తాక ట్టుపెట్టి తీసుకునే పంట రుణాలకు సైతం సిబిల్ స్కోర్‌పరిగణనలోకి తీసుకుంటుం డడంతో రైతుల్లో కలవరం మొదలైంది.

## తెలంగాణలో బిజెపిని ఎవరు పట్టించుకుంటారు?
### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, ఆగస్టు 12(జర్నలిస్ట్‌ఫైల్):** బిజెపిది పైకి జాతీయవాదం లోపల అంతా మతతత్వం, అధికారతత్వమని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం సిఎల్‌పి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన చరిత్ర రాహుల్ గాంధీ కుటుంబానిదని ఈ దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన ఒక్క బిజెపి నాయకుడిని చూపించాలని ఆయన సవాల్ విసిరారు.ఈ దేశ రక్షణ కోసం మూడుసార్లు యుద్ధం చేసిన గెలిచిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలదని ఆయన గుర్తుచేశారు. అమెరికాను కూడా ఉక్కు మహిళ ఇందిరాగాంధీ లెక్క చేయలేదని వివరిం చారు. దేశమంతా యుద్ధం చేయండని మీ వెంట మేం ఉంటామంటే చేతులెత్తేసిన చరిత్ర మోడీదని అపహాస్యం చేశారు. ట్రంప్ చెప్పాడని యుద్ధం ఆపేసి దేశ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని దుయ్యబట్టారు. తెలంగాణ బీసిలకు ఓ న్యాయం, బిహార్ బీసిలకు ఓ న్యాయమా, ఎందుకు గవర్నర్ న్యాయసమీక్షకు పంపారు రామచంద్రరావు ముందు తెలంగాణ బీసిలకు సమాధానం చెప్పు అని ఆయన ప్రశ్నించారు. రామచంద్రరావు ఎంత హడావిడి చేసినా తెలంగాణ ప్రజలు బిజెపి నమ్మరని ఆయన అన్నారు. కేంద్రంలో 400 సీట్లు గెలుస్తామని చివరకు 240 సీట్లకు పరిమితమయ్యారని ఆయన విమర్శించారు. బిజెపి పని కేంద్రంలోనే అయిపోయింది ఇక తెలంగాణలో ఎవరు పట్టించుకోరని ఆయన అన్నారు.

# ప్రజాస్వామ్యానికి బ్యూరోక్రసీ కీలకం
## సివిల్స్‌లో తెలంగాణ నుంచి అత్యధిక అభ్యర్థులు: డిప్యూటీ సీఎం విక్రమార్క

**హైదరాబాద్, ఆగస్టు 12(జర్నలిస్ట్‌ఫైల్):** ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సివిల్స్ లో తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపికవ్వాలనీ సూచించారు. హైదరాబాద్‌లో సోమవారం సింగరేణి ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన 178 మందికి లక్ష రూపాయలు చొప్పున అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ వనరులు అతి ముఖ్యమైనవి, వాటిని సానబట్టి వజ్రాలుగా తయారు చేస్తే సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతారన్నారు. సివిల్స్ సిద్ధమవుతున్న అభ్యర్థులకు అన్ని విధాలుగా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అభ్యర్థులకు మనోధైర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. అలాగే సివిల్స్ ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా లక్ష ఆర్థిక సాయంతో పాటు, ఢిల్లీలో వసతులు కల్పిస్తాం అని హామీ ఇచ్చారు. మొదటి సంవత్సరం 148 మందికి ఆర్థిక సహాయం అందించగా, వీరిలో 10 మంది సివిల్ సర్వీస్ కి ఎంపికయ్యారన్నారు. ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి సివిల్ సర్వీసెస్ ద్వారా అవకాశముంటుందని తెలిపారు. నిబద్ధత సేవలందిస్తే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరవేస్తేనే ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయి అన్నారు. అధికారుల్లో చిత్తశుద్ధి లోపిస్తే ప్రభుత్వ లక్ష్యాలు ఎంత గొప్పగా ఉన్నా ఫలితం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, సింగరేణి సిఎండి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



## ఫసల్ బీమాకు రూ.3,200 కోట్లు విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 12(జర్నలిస్ట్‌ఫైల్):** దేశవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద నిధులను కేంద్రం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివారజ్ చౌహాన్ దీనికి సంబంధించిన నిధులను సోమవారం విడుదల చేశారు. ఈ సారి మొత్తం రూ.3,200 కోట్లు 30 లక్షల మంది రైతులకు జమ చేస్తోంది. ఈపథకంలో అతిపెద్ద లబ్ధిదారులు మధ్యప్రదేశ్ రైతులే ఉన్నారు. వారికీ రూ.1,156 కోట్లు జమ చేసింది. అలాగే రాజస్థాన్ రైతులకు రూ.1,121 కోట్లు, ఛత్తీస్‌గఢ్ రైతులకు రూ.150 కోట్ల నిధులు విడుదలయ్యాయి. మిగతా రాష్ట్రాల రైతులకు కలిపి రూ.773 కోట్లు విడుదల చేసింది. కాగా వర్షాభావం, వరదలు, తుఫానులు, కరువు, తెగుళ్లు వంటి కారణాలతో పంటలు నష్టపోయినప్పుడు ఈ బీమా వర్తిస్తుంది. అంతేకాదు, పంట కోయగానే పొలంలో ఆరబెడుతున్న సమయంలో జరిగిన నష్టానికి కూడా ఈ పథకం రక్షణ ఇస్తుంది. అధికారులు నష్టాన్ని అంచనా వేసి, 15 రోజులలోపే క్లెయిమ్ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. ఇక 2016లో కేంద్ర ప్రభుత్వం ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను ప్రారంభించింది. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు వంటి కారణాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులను ఆదుకోవడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. ఈ పథకంలో రైతులు చెల్లించాల్సిన ప్రీమియం చాలా తక్కువగా ఉంటుంది. ఖరీఫ్ పంటలకు కేవలం రూ.2, రబీ పంటలకు రూ.1.5 , వాణిజ్య పంటలకు రూ.5 మాత్రమే. మిగతా ప్రీమియం మొత్తాన్ని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం సమానంగా భరిస్తాయి. దీని వల్ల రైతులపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుంది.

## రేవంత్‌రెడ్డిపై కేసు దాఖలు చేసిన పిటిషనర్‌కు సుప్రీం అక్షింతలు

**(జర్నలిస్ట్‌ఫైల్‌ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు 12:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దాఖలు చేసిన పిటీషనర్ పెద్దిరాజుపై సుప్రీంకోర్టు సీరియస్ అయి అక్షింతలు వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు అఫిడవిట్ రూపంలో క్షమాపణలు చెప్పాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పిటీషనర్ పెద్దిరాజును ఆదేశించింది. రేవంత్‌రెడ్డిపై పెద్దిరాజు దాఖలు చేసిన కేసును గతంలో తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఆ కేసును నాగ్‌పూర్ బెంచ్‌కి బదిలీ చేయాలని సుప్రీంలో పెద్దిరాజు ట్రాన్స్‌ఫర్ పిటీషన్ దాఖలు చేశారు. అందులో హైకోర్టు న్యాయమూర్తిపైనా పిటీషనర్ పెద్దిరాజు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. కాగా సోమవారం విచారణ సందర్భంగా పిటీషన్ డ్రాఫ్ట్ చేసిన ఏఓఆర్, పెద్దిరాజులపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ధర్మాసనం తెలిపింది. క్షమాపణ చెపుతూ దాఖలు చేసే అఫిడవిట్‌పై నిర్ణయాన్ని జస్టిస్ మౌసమి భట్టాచార్యకు వదిలేసింది. వారం రోజుల్లో అఫిడవిట్ దాఖలుచేయాలని పెద్దిరాజుకు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణ 4వారాలకు వాయిదా వేసింది.

## ఫీజు బకాయిలుచెల్లించలేని స్థితిలో ప్రభుత్వం:ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (మెహదీపట్నం), ఆగస్టు12 (జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు బకాయలు కూడా చెల్లించలేని అసమర్థ పాలన కొనసాగుతుందని బీసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఘాటుగా విమర్శించారు. ఇలాంటి అసమర్థ పాలన ఉన్నా ఒకటే, పోయినా ఒకటే అన్నారు. సోమవారం బీసి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రైవేటు యూనివర్సిటీలలో బీసి,ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగిపోయింది. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణలో 14.లక్షల మంది కళాశాల విద్యార్థుల ఫీజు బకాయిలు ఏకంగా రూ.6.వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పేద విద్యార్థులకు చదువుకునేందుకు ఉపయోగపడే ఈ స్కాలర్‌షిప్ విధానంను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. విద్య రాజ్యాంగబద్ధమైన హక్కు అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు లక్షల కోట్ల అప్పులు చేస్తూ, విద్యార్థుల ఉన్నత చదువుల కోసం స్కాలర్‌షిప్ బకాయిల కోసం ఎందుకు అప్పులు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20.నెలల వుతున్నా 20 రూపాయలు కూడా స్కాలర్‌షిప్‌ల కోసం విడుదల చేయలే దన్నారు. బడ్జెట్ లో రూ.5.వేల కోట్లు కేటాయించి ఒక్క రూపాయి కూడా ఇవ్వక పోవడం దారుణమన్నారు. స్కాలర్ షిప్‌లను విడుదల చేయకపోతే లక్షలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవు తారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సర్కారు స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను మంజూరు చేయాలని, లేనిఎడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ముట్టడిలో విద్యార్థి సంఘం నాయకులు నందగో పాల్, మణికంఠ, శివ, ప్రీతం, నిఖిల్, ధనూష్‌తో పాటు వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.






సోమవారం ధర్నాచౌక్‌వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న వివిధ బ్యాంకుల పెన్షనర్లు

## పెన్షన్ అప్‌డేషన్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి
### ఆల్ ఇండియా బ్యాంక్ పెన్షనర్స్ అండ్ రిటైరీస్ కాన్ఫెడరేషన్ నాయకులు డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 12(జర్నలిస్ట్‌ఫైల్):** గత 30 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్ అప్‌డేషన్‌ను తక్షణమే పూర్తి చేయాలని ఆల్ ఇండియా బ్యాంక్ పెన్షనర్ అండ్ రిటైరీస్ కాన్ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆల్ ఇండియా బ్యాంక్ పెన్షనర్స్ అండ్ రిటైరీస్ కాన్ఫెడరేషన్ ఏ.పీ, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్‌బీఐ నుండి ఏ.రమేష్‌బాబు, సిండికేట్ బ్యాంకు నుంచి కే.సురేష్‌బాబు, ఇండియన్ బ్యాంకు నుంచి కే.సూర్యనారాయణమూర్తి, ఎస్‌బీహెచ్‌కు చెందిన ఎం.చక్రపాణి, రోహిణిరావు, ఉప్పు సుధాకర్, కెనరా బ్యాంక్ నుంచి సీఎస్‌ఆర్ ఆంజనేయులు, ఫెడరల్ బ్యాంకు నుంచి టివి సుబ్బారావు, సెంట్రల్ బ్యాంక్ నుంచి కే.మధుసూదన్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ రిటైరయిన వారి కోసం 4.5 లక్షల కార్పస్ ఫండ్ అందుబాటులో ఉంది కాబట్టి, పెన్షన్ రెగ్యులేషన్ 35(1)లో పేర్కొన్న విధంగా పెన్షన్ అప్‌డేషన్ చేసినందువల్ల బ్యాంకులపై కానీ, ప్రభుత్వం పైన కానీ ఎటువంటి ఆర్థిక భారం పడదని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుననుసరించి, స్పెషల్ అలవెన్స్‌ను మూల వేతనంగా పరిగణించాలని, పదవీ విరమణ చేసిన వారి ఆరోగ్య భీమా ప్రీమియం మొత్తం బ్యాంకులే భరించాలని డిమాండ్ చేశారు.

## కెసిఆర్ కుటుంబం ఏ క్షుద్రపూజలు చేసిందో ఎస్‌ఎల్‌బిసి కూలింది
### ఆంధ్రప్రదేశ్ తరహాలో తెలంగాణలో అరెస్టులు ఉంటాయనుకోవద్దు: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 12(జర్నలిస్ట్‌ఫైల్):** కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చుని క్షుద్రపూజలు చేసినట్టున్నాడని అందుకే ఎస్.ఎల్.బి.సి కూలిపోయిందని రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి ఆవేదన చెందారు. సోమవారం సచివాలయంలో విలేఖరులతో చిట్‌చాట్‌లో వెంకటరెడ్డి మాట్లాడుతూ మా జిల్లా మాజీ మంత్రికి షాబాద్‌లో 80 ఎకరాల ఫామ్ హౌస్ ఉందని ఆరోపించారు. బిఆర్‌ఎస్ అగ్రనేతల బినామీలు ఫోన్ ఎత్తడంలేదని అన్నారు. బిఆర్‌ఎస్‌లో వాళ్లకు వాళ్లే కొట్టుకుంటున్నారని ఆయన అన్నారు. నేను ఏడుసార్లు ఎన్నికల్లో పోటీచేసి ఆరుసార్లు గెలిచా అని ఆయన వివరించారు. నా అఫిడవిట్ లో ఎలాంటి తప్పులు లేవు. ఆంధ్రప్రదేశ్ రాజకీయం వేరు తెలంగాణలో రాజకీయం వేరు అని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను చూసి తెలంగాణలో అరెస్టులు ఉంటాయని అనుకోవద్దు అని ఆయన చెప్పారు. చింతల్ టూ హయత్ నగర్ డబుల్ డెక్కర్ రోడ్డు మంజూరు చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి 96శాతం భూసేకరణ పూర్తిచేశాముఒక్క రీజినల్ రింగ్ రోడ్డుపైన 20నుంచి 30 మీటింగ్స్ పెట్టామని చెప్పారు.కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు.ఏ పార్టీ వారు అయినా అపాయింట్మెంట్ అడగ్గానే గడ్కరీ ఇస్తున్నారు. గతంలో ఆర్ అండ్ బి మంత్రి ప్రశాంత్ రెడ్డికి ఢిల్లీ ఎక్కడ ఉందో తెలియదు. ప్రశాంత్ రెడ్డికి అధికారులు తెలియదు ఎవరూ తెలియదుసెక్రటేరియట్ కట్టి రూ.350 కోట్లు బకాయిలు మా మీద పెట్టారు.32 జిల్లాల్లో కలెక్టర్ ఆఫీసులు కట్టామని బిఆర్‌ఎస్ గొప్పలు చెప్పుంది.

32 కలెక్టర్ ఆఫీసుల నిర్మాణానికి చేసిన అప్పులు ఇప్పుడు క్లియర్ చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ ను విశ్వనగరం చేశామని కెటిఆర్ గొప్పలు చెప్పుకుంటున్నారుకానీ ఉప్పల్ నుంచి నారపల్లి రోడ్డు 8కిలోమీటర్లు 2017 నుంచి ఇప్పటివరకు పూర్తికాలేదని అపహాస్యం చేశారు.

## 14 నుండి ఖనిజ బ్లాకుల వేలం

**హైదరాబాద్, ఆగస్టు 12(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణలో ఖనిజాల బ్లాక్‌ల క్వారీ రీజుల మంజూరుకు రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ రెండో విడత వేలానికి ఏర్పాట్లు చేస్తోంది. రెండో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 34 చిన్న తరహా ఖనిజాల బ్లాక్‌ల లీజుకు వేలం జరగనుంది. ఈ నెల 14 నుండి 22వ తేదీ వరకూ ఈ రెండో విడత వేలం జరగనున్నాయి. వేలం ప్రక్రియ ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తవుతుందని గనులు, భూగర్భ శాఖ ప్రకటించింది. దీనికి సంబంధించి ఇప్పటికే గత నెల 17వ తేదీన నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. కాగా ఈ ఏడాది జరిగిన తొలివిడ వేలంలో దాదాపు 187.5 ఎకరాల విస్తీర్ణంలోని 256 ఖనిజాల బ్లాక్‌లను వేలం వేసింది. ఇందులో 19 బ్లాక్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి 56 కోట్ల రూపాయల మేర ఆదాయం సమకూరింది.

## ఐడీబీఐ బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు ఎల్‌ఐసీ ఉద్యోగుల మద్దతు

**హైదరాబాద్ (ముషీరాబాద్),ఆగస్ట్ 12(జర్నలిస్ట్‌ఫైల్):** ఐడీబీఐ బ్యాంకు ఉద్యోగుల సమ్మెలకు ఎల్‌ఐసీ ఉద్యోగులు మద్దతు ప్రకటించారు. ఈమేరకు సోమవారం ఎల్‌ఐసీ, సికింద్రాబాద్ డివిజన్, ఐసీఈయూ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఐడీబీఐ ఉద్యోగుల ఒక్కరోజు సమ్మెకు సంఘీభావంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో కేంద్ర ప్రభుత్వ విధానంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐసీఈయూ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.రఘు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న ఐడీబీఐ బ్యాంకును ప్రైవేట్ పరం చేసే విధానాన్ని అన్ని ఉద్యోగ సంస్థలు ఖండిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసియూ అధ్యక్షులు ఎస్. గుణశేఖర్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎస్.సి. అనూరాధ, చంద్రశేకర్, ప్రభాకర్, కౌశిక్, జావేద్, హిమబిందు పాల్గొన్నారు.

# బియ్యం సేకరణకు ఒప్పుకోని ఎఫ్‌సిఐ
## గోదాములు ఖాళీగాలేవన్న సాకుతో తిప్పిపంపుతున్న సిఎంఆర్ బియ్యం

**హైదరాబాద్, ఆగస్టు 12(జర్నలిస్ట్‌ఫైల్):** భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) తెలంగాణలో బియ్యం సేకరణకు మోకాలడ్డుపెడుతోంది. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన కస్టం మిల్లింగ్ రైస్ దిగుమతికి గోదాములు ఖాళీలేవని అధికారులు నిరాకరిస్తున్నారు.ప్రభుత్వానికి మిల్లర్లు ఇవ్వాల్సిన సిఎంఆర్ బియ్యం ఇచ్చేందుకు దిగుమతి కావటం లేదు. మిల్లుల ఆవరణలో ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటే నాణ్యత తగ్గుతుంది. నిల్వలు వెనక్కి తీసుకోవాలని అధికారులపై మిల్లర్లు ఇప్పుడు ఒత్తిడి పెంచుతున్నారు. లేదా వెంటనే బియ్యం దిగుమతి చేసుకోవాలి. ఎఫ్‌సిఐ తెలంగాణలో తన సొంత గోదాములతోపాటు ఎస్‌డబ్ల్యుసి,సెంట్రల్ వేర్‌హౌజ్‌గిడ్డంగులు ఇతర ప్రైవేటు అద్దెగిడ్డంగుల్లో సుమారు ఇప్పటికే 22లక్షలమెట్రిక్‌టన్నుల ధాన్యం నిల్వ చేశామని ఇక తెలంగాణలో మిల్లర్ల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేమని చేతులు ఎత్తేయడంతో రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్లు, రాష్ట్రప్రభుత్వం గగ్గొలు పడుతోన్నది. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న రైస్‌మిల్లుల్లో, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పౌరసరఫరాల సంస్థ గోదాములు బియ్యం బస్తాలతో పూర్తిగా నిండిపోయాయి. ఎఫ్‌సిఐ తెలంగాణ బాయిల్డ్ రైస్‌ను సేకరించకుండా ఉండటానికే ఇక్కడి గోదాముల్లో నిండిన స్టాక్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడంలేదని కొంత మంది రైస్‌మిల్లర్లు ఆరోపిస్తున్నారు. కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఎఫ్‌సిఐ సిఎంఆర్ బియ్యం సేకరణ చేయకుండా ఉండేందుకు మే31తో ముగి సిన గడువును ఉద్దేశ్యపూర్వకంగా పెంచడంలేదని తెలుస్తోంది. గత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి గడచిన మే 31వ తేదీతో సిఎంఆర్ బియ్యం అప్పగించే గడువు ముగి సింది. ఇంకా మిల్లర్లు రాష్ట్రవ్యాప్తంగా 43 శాతం ఖరీఫ్ బియ్యం అప్పగించాలి. కేంద్రం ఇప్పటివరకు గడువు పొడిగించలేదు. దీంతో గత ఖరీఫ్ సీజన్ కు సంబం ధించిన బియ్యం దిగుమతి చేసుకునే అవకాశం లేదు. ఇక రబీకి సంబంధించిన బియ్యం అప్పగించేందుకు మిల్లర్లు సిద్ధంగా ఉన్నా గోదాములు ఖాళీ లేవు. ఎఫ్‌సిఐకి తెలంగాణ వ్యాప్తంగా ఆరు నుంచి ఏడు లక్షల మె.ట ఆహార ఉత్పత్తులను నిల్వచేసే సామర్థ్యం కలిగిన సొంత గిడ్డంగులు పరిమితమైన స్థాయిలోనే ఉన్నాయి. నిజామాబాద్



జిల్లా డిచ్‌పల్లిలో పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గిడ్డంగి ఉంది. మిర్యాలగూడలో 90వేల మె.టన్నులు, నల్లగొడలలో 60వేల మె.ట. చర్లపల్లిలో లక్షా 25వేలమె.ట. నసత్‌నగర్‌లో 65వేలమె.ట, వరంగల్‌లో 1,10,000 మె.ట, జమ్మికుంటలో 62వేలమె.ట, పెద్దపల్లిలో 16వేలమె.ట. మంచిర్యాలలో 30వేల మె.ట సామర్థ్యం కలిగిన సొంత గిడ్డంగులు ఉన్నాయి. సొంతగిడ్డంగులతో పాటు అద్దెగిడ్డంగులలో రాష్ట్రవాప్తంగా సరుకు నింపి ఉంచారు. ఆ సరుకు ఉండగా మేం వేరే సరుకు తీసుకోమని ఎఫ్‌సిఐ అధికారులు పంపుతున్నారు. మిల్లర్లు మాత్రం ఎఫ్‌సిఐ ప్రతి నిల్వలను లాట్లుగా చేసి నిల్వచేస్తారని ఒక్కోలాటులో రెండు నుంచి మూడు ఎస్‌కెల బియ్యం ఖాళీలు ఉన్నప్పటికి లాట్లు అన్ని నిండి ఉన్నాయని చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. ఆరు ఎస్‌కెల బియ్యం నిల్వ చేస్తే ఒక లాటుగా చూపుతారు. ఎస్‌కెకు 290మె.ట బియ్యం ఉంటాయి. బాయిల్డ్ రైస్‌ను తెలంగాణ నుంచి సేకరణ చేయవద్దనే ఇక్కడి సరుకు పొరుగు రాష్ట్రాలకు పంపడంలేదని తెలుస్తోంది. అదే విధంగా మహారాష్ట్ర,కర్ణాటక, ఛత్తీస్‌గడ్‌లో తమిళనాడు, కేరళలో వరిపంట దిగుబడి పెరడంతో తెలంగాణ బాయిల్డ్‌రైస్‌కు దేశంలో డిమాండ్ తగ్గింది. దీనితో సిఎంఆర్ బియ్యం సేకరణ గడువు ముగిసినా మళ్లీ పెంచకుండా బియ్యం తీసుకోకుండా మోకాలడ్డు పెడుతున్నారని వ్యాపారులు అంటున్నారు.

## ఐటిపి సేవలను ప్రారంభించిన పోస్టల్ శాఖ

**హైదరాబాద్,ఆగస్టు 12(జర్నలిస్ట్‌ఫైల్):** ఇండియన్ పోస్టల్ డిపార్టుమెంట్ సాంకేతికతను అభివృద్ధి చేసుకుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తోంది. ఇందులో భాగంగా ఐటిపి (ఇంటర్నేషనల్ ట్రాక్ ప్యాక్డ్ సర్వీసెస్) పేరుతో కొత్త సేవలను ప్రారంభించింది.ఈ సేవలతో ప్రపంచవ్యాప్తంగా 45 దేశాల్లో ఉండే భారతీయులతో పాటు ఆయా దేశాల్లో ఉండే వారికి వేగంగా సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది.ఈ సేవలతో ఇకామర్స్ ఎగుమతిదారుల అవసరాలకు అనుగుణంగా, సరిహద్దు లావాదేవీల కోసం రూపొందించబడిన ఒక ప్రత్యేక పరిష్కారమని అదే సమయంలో వ్యక్తిగత కస్టమర్లకు కూడా సమానంగా తమ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. మొదటి దశలో చైనా, హాకాంగ్,జపాన్, మలేసియా, సింగపూర్,కెనడా,జర్మని, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో పాటు యుఎస్‌ఏ,గ్రేట్‌బ్రిట్ వంటి అగ్రదేశాలకు కూడా ఐటిపి సేవలు అందించవచ్చని తెలిపింది.ఈ సేవల్లో వెయిట్ లిమిట్ ఉటుందని, 2 కేజీల నుంచి 5కేజీల వరకు బరువుకు సంబంధించిన పార్సిల్స్ మాత్రమే అంగీకరించనున్నట్లు పేర్కొంది. తమ పార్సిల్స్‌లను ఎక్కడిక్కడే ట్రాక్ చేసుకునే సుదపాయం కూడా ఉంటుందని తెలిపింది. పార్సిల్ సర్వీసులను వేగవంగా అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, తెలిపింది.ఈ సేవలను వినియోగించుకునేందుకు 18 శాతం జిఎస్టీ కూడా వసూలు చేస్తున్నట్లు సంస్థ ఒక పక్రటనలో పేర్కొంది.

# సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా పేద విద్యార్థికి ఆర్థిక సహాయం



**విజయవాడ, ఆగస్టు 12(జర్నలిస్ట్ఫైల్):**

విజయవాడ పాయకాపురంలో మహాలక్ష్మి ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతుంది. తండ్రి చనిపోయాడు, తల్లి కూలిపనిచేస్తుంది, కాలేజీ ఫీజు కట్టే స్తోమత లేక తన చదువు మానేస్తాను అని తెలిపింది. విషయం తెలుసుకున్న శీరం బుజ్జి మహాలక్ష్మి ని వాళ్ల అమ్మని పిలిచి మాటలాడి తన ఫీజు కడతాను అనిచెప్పి కాలేజీకి పంపించారు. ఆగస్ట్ 9న మహేష్ బాబు 50 వ పుట్టినరోజు సందర్భంగా మహాలక్ష్మి కి 50000 యాభైవేలు రూపాయలు ఫీజు ఫ్యాన్ అధ్యక్షులు శీరం బుజ్జి తాడి శివ కేదారిప్రసాద్ కొండ్రు శివ ఫీజును మహాలక్ష్మికి అందచేసి ఫీజు కట్టారు.

# ఈనెల 30, 31 తేదీలల్లో యుఎస్ లో మున్నూరుకాపు మహాసభలు

## రాధా-రంగా మిత్రమండలి నేత బుల్లెట్ ధర్మారావు



**కాలిఫోర్నియా, ఆగష్టు, 12(జర్నలిస్ట్ఫైల్):**

అమెరికాలోని కాలిఫోర్నియాలోని మిల్పిటస్ లో జరిగిన "గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్" ఆత్మీయ సమావేశము భారత కాలమానప్రకారం ఆదివారం రాత్రి జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాధా రంగా మిత్రమండలి ఆంధ్ర తెలంగాణ అధ్యక్షులు మరియు జనసేన పార్టీ నాయకులు బుల్లెట్ ధర్మారావు హాజరైయారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ధర్మారావు ఘనంగా సత్కరించి ఆగస్టు 30, 31వ తేదీలలో వర్జీనియాలో జరుగనున్న మున్నూరు కాపు మహాసభలకు రావలసినదిగా ఆహ్వానించారు. ఈసందర్భంగా బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ ఎక్కడో కృష్ణా జిల్లాలో మచిలీపట్నంలో వుండే తనను ఈరోజు అమెరికా వచ్చిన సందర్భంగా మున్నూరు కాపు అసోసియేషన్ ఆత్మీయ సమావేశంనకు ఆహ్వానించినందుకు తన అదృష్టంగా భావించి సంఘ నాయకులకు ఇక్కడకు విచ్చేసిన మున్నూరు కాపు నాయకులకు, మహిళలకు అందరకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రంగా మిత్రమండలి ఆంధ్ర తెలంగాణ అధ్యక్షుడిగా తెలియచేస్తున్న ఒక విషయం ఏమంటే ఆనాడు కీర్తిశేషులు వంగవీటి మోహన రంగా కాపునాడు పెట్టి అందరూ సమిష్టిగా కలిసి ఉండాలని ఆయన కోరిక తోపాటు అలాగే ఈ రోజున మేము జనసేన అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ కి పూర్తిగా రాధా రంగా మిత్రమండలి మద్దతు తెలియజేయటంతోపాటు తాను 42 నియోజకవర్గాలలో కమిటీలను వేసి పవన్ కళ్యాణ్ కాపులను పెద్దన్న పాత్ర పోషించమని ఇచ్చిన పిలుపు మేరకు కూటమి అభ్యర్థుల గెలుపునకు ఎంతో కృషి చేయడం జరిగినదన్నారు. అలాగే గత నెల జులై 4వ తేదీన శ్ వంగవీటి మోహన రంగా గారి 78వ జయంతిని అమెరికాలోని కాలిఫోర్నియాలో మొట్టమొదటిసారిగా ఆప్త కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తనను అరవ రామకృష్ణని, ముఖ్యఅతిథిగా ఆహ్వానించి ఘనంగా నిర్వహించటం విశేషం అని పొగిడారు .అలాగే తమ మిత్ర మండలి మున్నూరు కాపులకు, బలిజలకు, తెలగలకు,తూర్పుకాపులు, ఒంటరిలకు గాని ఎవరికీ వ్యతిరేకం కాదు.మేము అందర్నీ కలుపుకుని మనమంతా %శీనివ% కుటుంబం,కుటుంబం అనే భావనతో రంగా గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం కాబట్టి మేము ఈ మున్నూరు కాపు అసోసియేషన్ మహాసభలకు రాధా రంగా మిత్రమండలి పూర్తి మద్దతు తెలియజేస్తున్నాము. అమెరికాలోని వర్జీనియాలో ఈనెల 30,31వ తేదీలలో జరుగు మున్నూరు కాపుల రెండురోజుల మహాసభలను జయప్రదం చేయవలసినదిగా ఈసందర్భంగా బుల్లెట్ ధర్మారావు కోరారు. కోరడమైనది. ఈ సమావేశమునకు ఇంకా పశ్చిమగోదావరిజిల్లా మొగల్తూరు మండలం కాళీపట్నం కు చెందిన నాయకులు మేడిది.బాబ్జి, హైదరాబాదుకు చెందిన బోల్లిముంత.సత్యనారాయణ . హాజరైనారు.ఈ కార్యక్రమం నిర్వహించిన సంఘ నాయకులు. సంఘాని రజనీకాంత్, పెద్ది వెంకట్ ,పసుపులేటి సతీష్ ,నేతి రవి ,తోట రామ్ మహిళ నేతలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.

# యల్.బి.ఆర్.సి.ఈ ఫిజిక్స్ విభాగంలో అధ్యాపక అభివృద్ధి శిక్షణా కార్యక్రమం

**మైలవరం, ఆగష్టు 12(జర్నలిస్ట్ఫైల్):**

స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి కళాశాలలో ఫ్రెష్ మెన్ ఇంజనీరింగ్ విభాగం లోని భౌతిక శాస్త్ర విభాగం వారు ఐదు రోజుల పాటు ""డెమైస్టిఫయింగ్ క్వాంటుమ్ కంప్యూటింగ్: ఫ్రమ్ ఫండమెంటల్ టూ ఫ్యూచర్ అప్లికేషన్స్ " అనే అంశం పై ఆన్లైన్ అధ్యాపకుల అభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి డాక్టర్ అలోక్ కుమార్ పాన్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), హైదరాబాద్, భౌతిక శాస్త్ర విభాగం, క్వాంటం ఫౌండేషన్స్, క్వాంటం ఇన్ఫర్మేషన్ థియరీ మరియు క్వాంటం కమ్యూనికేషన్లో ప్రఖ్యాత నిపుణుడు. రిసోర్స్ పర్సన్అ గా వ్యవహరించారు . అతని సెషన్లు క్వాంటం కంప్యూటింగ్ యొక్క సైద్ధాంతిక మరియు అనువర్తిత అంశాలపై లోతైన అంతర్దృష్టులను అందించాయి, ఇవి విద్యావేత్తలు మరియు కెరీర్ ప్రారంభ పరిశోధకులకు ప్రయోజనం చేకూర్చేలా రూపొందించబడ్డాయి. ఈ ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో క్వాంటం కమ్యూనికేషన్: క్వాంటం ఎంటాంగిల్మెంట్, క్వాంటం టెలిపోర్టేషన్ మరియు సెక్యూర్ డేటా ట్రాన్స్మిషన్ వంటి అంశాలు , క్వాంటం-ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థల పరివర్తన సామర్థ్యాన్ని వివరించారు క్వాంటం సమాచారం:: క్వాంటం సమాచారం ఎలా ప్రాతినిధ్యం వహిస్తుంది మరియు మార్చబడుతుంది అనే దానిపై ప్రాథమిక అవగాహన మరియు క్వాంటం కంప్యూటింగ్ యొక్క అనువర్తనాల పై ఆచరణాత్మక ఉదాహరణలతో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు , వైస్ ప్రిన్సిపాల్ డా బి. రమేష్ రెడ్డి , ఫ్రెష్ మెన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.టి. సత్యనారాయణ , డా ఎం. శ్రీనివాస రావు డీన్-అకడమిక్స్ డాక్టర్ ఎస్. పిచ్చిరెడ్డి, డీన్-ఆర్-డి మరియు భౌతిక శాస్త్ర విభాగ సంబంధిత అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డా.టి.సత్యనారాయణ కన్వీనర్ గా, డా. యూసుబ్ కో ఆర్డినేటర్లు గా వ్యవహరించారు.

# హర్ దిల్ తిరంగా.. హర్ ఘర్ తిరంగా..

- దేశభక్తిని చాటిచెప్పేలా మువ్వన్నెల జెండా రెపరెపలు
- ప్రతి గుండె ఉప్పొంగేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు
- ఉత్సాహంగా పంద్రాగస్టు వేడుకలకు సన్నద్ధం
- సరిహద్దులో మన వీర సైనికుల త్యాగాలు చిరస్మరణీయం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- ఈ స్వేచ్ఛ.. ఎందరో మహనీయుల త్యాగ ఫలితం : సీపీ ఎస్వీ రాజశేఖరబాబు




**విజయవాడ, ఆగస్టు 12(జర్నలిస్ట్ఫైల్):**

ప్రతి మదిలో, ప్రతి ఇంటిపైనా దేశభక్తిని చాటిచెప్పేలా మువ్వన్నెల జెండా రెపరెపలాడుతోందని.. ప్రతి గుండె ఉప్పొంగేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పంద్రాగస్టు వేడుకులకు సిద్ధమవుతున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం విజయవాడ ఓల్డ్ జీజీహెచ్ వద్ద జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో విజయవాడ నగరపాలక సంస్థ, రెవెన్యూ, పోలీస్, యువజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు వాకర్స్ క్లబ్ వంటి వివిధ అసోసియేషన్ల నుంచి పెద్దఎత్తున ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. బైక్, సైకిల్ ర్యాలీతో పాటు స్కేటింగ్ చేస్తూ చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. త్రివర్ణపతాకాలు చేతబూని భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం, ఓల్డ్ జీజీహెచ్ రహదారులు మార్మోగిపోయాయి. అమరవీరుల బలిదానం.. నేటి స్వేచ్ఛా భారతం, త్రివర్ణ పతాకం ఐకమత్యానికి సంకేతం నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సరిహద్దుల్లో మన వీర సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని.. ఆపరేషన్ సిందూర్ మన దేశ సత్తాను చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఏదో ఒక రోజుకి పరిమితం కాకుండా ప్రతి హృదయమూ త్రివర్ణ పతాక ఐక్యతా స్ఫూర్తిని నింపుకొని ప్రతిరోజూ ముందడుగు వేయాలని, ప్రతిఒక్కరూ దేశ సమగ్రాభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా వంటి గొప్ప కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నందుకు గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఈ స్వేచ్ఛ.. ఎందరో మహనీయుల త్యాగ ఫలితం: సీపీ ఎస్వీ రాజశేఖరబాబు**

మనం నేడు అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎందరో మహనీయుల త్యాగ ఫలితమని.. మనకు స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నో రంగాల్లో ముందుకెళ్లామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. దేశమంటే మాతృమూర్తితో సమానమని.. దేశభక్తితో దేశాభివృద్ధికీ ప్రతిఒక్కరూ సమష్టిగా ముందడుగు వేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రగతి పథంలో వడివడిగా ముందడుగు వేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని రాజశేఖరబాబు అన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, వీఎంసీ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, డీఎంహెచ్వో డా. ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సేవ ప్రయాణం నయనానందం

- స్పృహాప్తి, అమరావతి ఐ హాస్పిటల్ సేవలు భేష్
- ఆరోగ్య ఆంధ్ర సాకారానికి సమష్టి భాగస్వామ్యం అవసరం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఆగస్టు 12(జర్నలిస్ట్ఫైల్):**

సర్వేంద్రియానాం.. నయనం ప్రధానమని, పేదల కంటి ఆరోగ్యాన్ని కాపాడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న స్పృహాప్తి చారిటబుల్ ట్రస్ట్, అమరావతి ఐ హాస్పిటల్ సేవలు ప్రశంసనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం నగరంలోని పటమట నల్లూరువారి కళ్యాణమండపంలో స్పృహాప్తి చారిటబుల్ ట్రస్ట్, అమరావతి ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నయనం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సుసంపన్న, ఆరోగ్య, ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికి సమష్టి కృషి అవసరమని.. తొలి అడుగుగా 2029 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఈ మహాయజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలోని పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు స్పృహాప్తి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 200 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి శుక్లం ఆపరేషన్లు చేయడంతోపాటు మందులు అందించారు. కార్యక్రమంలో ఫింగర్ ప్రింట్ బ్యూరో డీఎస్పీ ఆర్.శివారెడ్డి, స్పృహాప్తి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వి.భారతీదేవి, అమరావతి ఐ హాస్పిటల్ ఎండీ డా. శైలజ కేతినేని, స్పృహాప్తి బృంద సభ్యులు టి.మాధురి, డి.పద్మ, వి.లేపాక్షి, కంటి వైద్య నిపుణులు డా. వేణు తదితరులు పాల్గొన్నారు.



# మొక్కలు.. భావితరాలకు కానుకలు

**విజయవాడ పశ్చిమ, ఆగష్టు 12(జర్నలిస్ట్ఫైల్):**

మనిషికి ప్రాణాధారమైన ఆక్సిజన్ ను అందించే మొక్కలు నాటడం, సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు భావితరానికి మనం అందించే కానుకలు అని కెబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అన్నారు. సుప్రసిద్ధ సామాజిక సేవకుడు, కలాం యువ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పిడికిటి భూపాల్ పుట్టినరోజు సందర్భంగా కళాశాల ఎన్.ఎస్.ఎస్. మరియు రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యాన సోమవారం కళాశాలలో 400 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భూమి మనకు అందించే వరాల్లో మొక్కలు అత్యంత ప్రధానమైనవన్నారు. అనాలోచితంగా మానవ సమాజం చేస్తున్న మొక్కల నరికివేత కారణంగా ప్రకృతిలో అసమతౌల్యం ఏర్పడుతోందన్నారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ ఇవాళ మనం నాటే మొక్క వందలాది ప్రాణాలకు శ్వాస ఇస్తుందన్నారు. మొక్క పెంచడం అంటే భవిష్యత్తుకు భరోసా ఇవ్వటమే అన్నారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పిడికిటి భూపాల్ సౌజన్యంతో కళాశాల ఉద్యానవనంలో 400 మొక్కలు నాటారు. దాదాపు 250 మంది విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసారు. భూపాల్ ను కళాశాల ఘనంగా సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్, ప్రోగ్రాం ఆఫీసర్స్ డి.పవన్, ఎం.శాంతిబాబు, ఎం.జయవర్ధన్, ఎన్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.




# ఈనెల 30, 31 తేదీలల్లో యుఎస్లో మున్నూరుకాపు మహాసభలు



## రాధా-రంగా మిత్రమండలి నేత బుల్లెట్ ధర్మారావు

**కాలిఫోర్నియా, ఆగష్టు, 12(జర్నలిస్ట్ఫైల్):**

అమెరికాలోని కాలిఫోర్నియాలోని మిల్పిటస్ లో జరిగిన "గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్" ఆత్మీయ సమావేశము భారత కాలమానప్రకారం ఆదివారం రాత్రి జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాధా రంగా మిత్రమండలి ఆంధ్ర తెలంగాణ అధ్యక్షులు మరియు జనసేన పార్టీ నాయకులు బుల్లెట్ ధర్మారావు హాజరైయారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ధర్మారావు ఘనంగా సత్కరించి ఆగస్టు 30, 31వ తేదీలలో వర్జీనియాలో జరుగనున్న మున్నూరు కాపు మహాసభలకు రావలసినదిగా ఆహ్వానించారు. ఈసందర్భంగా బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ ఎక్కడో కృష్ణా జిల్లాలో మచిలీపట్నంలో వుండే తనను ఈరోజు అమెరికా వచ్చిన సందర్భంగా మున్నూరు కాపు అసోసియేషన్ ఆత్మీయ సమావేశంనకు ఆహ్వానించినందుకు తన అదృష్టంగా భావించి సంఘ నాయకులకు ఇక్కడకు విచ్చేసిన మున్నూరు కాపు నాయకులకు, మహిళలకు అందరకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రంగా మిత్రమండలి ఆంధ్ర తెలం గాణ అధ్యక్షుడిగా తెలియచేస్తున్న ఒక విషయం ఏమంటే ఆనాడు కీర్తిశేషులు వంగవీటి మోహన రంగా కాపునాడు పెట్టి అందరూ సమిష్టిగా కలిసి ఉండాలని ఆయన కోరిక తోపాటు అలాగే ఈ రోజున మేము జనసేన అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ కి పూర్తిగా రాధా రంగా మిత్రమండలి మద్దతు తెలియ జేయటంతోపాటు తాను 42 నియోజకవర్గాలలో కమిటీలను వేసి పవన్ కళ్యాణ్ కాపులను పెద్దన్న పాత్ర పోషించమని ఇచ్చిన పిలుపు మేరకు కూటమి అభ్యర్థుల గెలుపునకు ఎంతో కృషి చేయడం జరిగినద'న్నారు. అలాగే గత నెల జులై 4వ తేదీన శ్ వంగవీటి మోహన రంగా గారి 78వ జయంతిని అమెరికాలోని కాలిఫోర్నియాలో మొట్టమొదటిసారిగా ఆప్త కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తనను అరవ రామకృష్ణని, ముఖ్యఅతిథిగా ఆహ్వానించి ఘనంగా నిర్వహించటం విశేషం అని పొగిడారు .అలాగే తమ మిత్ర మండలి మున్నూరు కాపులకు, బలిజలకు, తెలగలకు, తూర్పుకాపులు, ఒంటరిలకు గాని ఎవరికీ వ్యతిరేకం కాదు.మేము అందర్నీ కలుపుకుని మనమంతా oke కుటుంబం, కుటుంబం అనే భావనతో రంగా గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం కాబట్టి మేము ఈ మున్నూరు కాపు అసోసియేషన్ మహాస భలకు రాధా రంగా మిత్రమండలి పూర్తి మద్దతు తెలియ జేస్తు న్నాము. అమెరికాలోని వర్జీనియాలో ఈనెల 30,31వ తేదీలలో జరుగు మున్నూరు కాపుల రెండురోజుల మహాసభలను జయప్రదం చేయవల సినదిగా ఈసం దర్భంగా బుల్లెట్ ధర్మారావు కోరారు. కోరడమైనది. ఈ సమావేశమునకు ఇంకా పశ్చిమ గోదా వరిజిల్లా మొగల్తూరు మండలం కాళీపట్నం కు చెందిన నాయకులు మేడిది.బాబ్జి, హైదరాబాదుకు చెం దిన బోల్లిముం త.సత్యనారాయణ. హాజరైనారు.ఈ కార్యక్రమం నిర్వహించిన సంఘ నాయకులు. సంఘాని రజనీకాంత్, పెద్ది వెంకట్ ,పసుపులేటి సతీష్ ,నేతి రవి ,తోట రామ్ ,మరియు పలువురు మహిళ నేతలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కొత్త ఐటి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

## మూజువాణి ఓటుతో చర్చలేకుండానే బిల్లు ఓకే..



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదంతెలిపింది. బైజయంత్ పాండా నేతృత్వంలోని 31 మంది సభ్యులతో కూడిన సెలక్షన్‌కమిటీచేసిన సిఫారసులమేరకు నవీకరించిన బిల్లును ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బిల్లుప్రవేశపెట్టిన కొన్ని గంటల్లోనే ఎలాంటిచర్చ జరగకుండానే మూజువాణి ఓటుతో సభ ఆమోదం పొందింది. బీహార్ ఓటర్ల సమగ్ర సవరణపై విపక్షాలు ఆందోళన నిర్వహిస్తుండటంతో దీనిపై చర్చకు తావులేకుండా పోయింది. బిల్లు పాస్ అయిన తర్వాత సభ మంగళ వారానికి వాయిదావేసారు. ఆరుదశాబ్దాలుగా అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961 స్థానంలో ఈఏడాది ఫిబ్రవరిలోనే కేంద్రం లోక్‌సభలో ఆదాయపుపన్ను బిల్లు 2025ను ప్రవేశపెట్టింది. విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాన్ని సెలక్ట్‌కమిటీకి పంపించింది. కమిటీ ప్రతిపాదనలు పరిగణనలోనికి తీసుకున్న అనంతరం ఆదాయపు పన్ను (నం.2) బిల్లు 2025ను కేంద్ర ఆర్తికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. గత శుక్రవారమే పాతబిల్లును ఉపసంహరించారు. సెలక్ట్ కమిటీ సిఫారసులన్నింటినీసుమారుగా ఆమోదించినట్లు మంత్రి తెలిపారు. 1961లో రూపొందించిన ఐటిచట్టానికి 66 బడ్జెట్‌లలో ఎన్నో సవరణలుజరిగాయి. దీనితో సంక్లిష్టంగా తయారయింది. ఈచట్టాన్ని సమీక్షించి సరళీకృతం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లోప్రభుత్వం తెలిపింది. ఆమేరకు కొత్త బిల్లును రూపొందించారు. లోక్‌సభ ఆమోదం తర్వాత ఆబిల్లు రాజ్యసభకు వెళుతుంది. రాష్ట్రపతి ఆమోదంతో కొత్తచట్టంగా మారుతుంది. 2026 ఏప్రిల్ ఒకటినుంచి అమలులోకి వస్తుంది. పాత ఆదాయపు పన్ను చట్టంలో గత ఏడాది అసెస్‌మెంట్ ఇయర్ అనేపదాలు వాడుకలో ఉన్నాయి. కొత్తవిల్లులో వీటిస్థానంలోపన్ను సంవత్సరం అనేపదంవినియోగంలోకి వస్తుంది. 2025 ఆదాయపు పన్ను బిల్లు కొత్తపన్నులేమీ విధించదు. ప్రస్తుతంఉన్న పన్నుశ్లాబులు రేట్లను మార్చదు. అలాగే ఐటిఆర్ ఫైలింగ్ గడువు తేదీలు ఆదాయపు పన్ను శ్లాబులు మూలధన లాభాల్లో ఎటువంటి మార్పులు ఉండవు. వేతనాలనుంచి డిడక్షన్ల పరంగాచూస్తే ప్రామాణిక తగ్గింపు, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితరాలు వేరువేరుసెక్షన్లు నిబంధనలకింద ఉన్నాయి. వీటిని ఒకేదగ్గరకు తీసుకొచ్చి పట్టిక రూపంలో కనిపించేటట్లుచేసారు.



## కర్ణాటకలో లక్ష నకిలీ ఓట్లున్నా ఇసి మౌనమేనా?

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తీవ్ర నిరసన

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కోసం ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్నాయని, స్పష్టమైన ఓటర్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. కర్ణాటకలో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఓ నియోజకవర్గంలో సర్వే నిర్వహించగా దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలాయన్నారు. ఈనిజం దేశంముందున్నా ఎన్నికల సంఘంమాత్రం దీనిపై మౌనం వహించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బీహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో విపక్ష ఎంపిలు 'పార్లమెంటు ఇసి' ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపిలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తంచేశారు.దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపిలను అదుపులోకి అక్కడి నుంచిబస్సులో తరలించారు. ఇది రాజకీయ పోరాటం కాదు, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నామని ఆయన తెలిపారు. 'ఒక మనిషి, ఒక ఓటు' కోసం ఈ పోరాటం చేస్తున్నామన్నారు. స్పష్టమైన ఓటర్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు.



## తుర్కియేలో భూకంపం: రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రత

### యువతి మృతి, 29 మందికి గాయాలు

**అంకారా, ఆగస్టు 12:** తుర్కియేలోని బలికెసిర్ ప్రావిన్సులో 6.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. భూకంపం ధాటికి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇస్తాంబుల్‌లోనూ భూమి కంపించిందని అధికారులు వెల్లడించారు. సిందిర్గి పట్టణంలో భూకంప కేంద్రం ఉందని, ఆ పట్టణంలో 16 భవనాలు నేలమట్టమయ్యాయని పేర్కొన్నారు. భవన శిథిలాల కింద చిక్కుకొని ఓ యువతి మృతిచెందిందగా, మరో 29 మందికి గాయాలయ్యాయని అధికారులు వెల్లడించారు. భవన శిథిలాలను తొలగించేందుకు రెస్క్యూ బృందాలు కృషి చేస్తున్నాయి. మరోవైపు, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ ఆకాంక్షించారు. భూకంప ప్రభావిత ప్రాంతాలలో జరుగుతున్న సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నానని ఎక్స్‌లో పోస్టు చేశారు. 2023లో 7.8 తీవ్రతతో సంభవించిన భూకంపం తుర్కియోలో మారణహోమాన్ని సృష్టించింది. భూకంప ధాటికి 53వేలకుపైగా ప్రజలు మృతిచెందగా, వందల్లో భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రమాద తీవ్రత గురించి టర్కిష్ మంత్రి అలీ యెర్లికాయ విలేకర్లతో మాట్లాడారు. ఇస్తాంబుల్, పర్యటక కేంద్రమైన ఇజ్మీర్‌తో సహా దేశంలో పశ్చిమాన ఉన్న అనేక నగరాల్లో భూకంపం సంభవించిదని పేర్కొన్నారు. ప్రమాద స్థలానికి వెంటనే విపత్తు దళాలు చేరుకొని సహాయ చర్యలు ప్రారంభించాయని చెప్పారు. భూకంప ధాటికి 16 భవనాలు కూలిపోయాయన్నారు. మూడు అంతస్తుల భవనం కూలిన ఘటనలో అందులో ఉన్న ఆరుగురు నివాసితులు ఉన్నారని, వారిని రెస్క్యూటీం క్షేమంగా బయటకు తీశారని ఆయన తెలిపారు. అయితే ఓ 80 యేళ్ల వృద్ధుడు శిథిలాల నుంచి వెలికి తీసిన కొద్ది సేపటికే మరణించారని చెప్పారు.

## రాహుల్‌కు నోటీసులివ్వడానికి వాళ్లెవరు?

### ఇసిపై కర్ణాటక డిప్యూటి సిఎం ఫైర్



**బెంగళూరు, ఆగస్టు 12:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కర్ణాటక రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేయడంపై ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీకి నోటీసులు ఇచ్చే అధికారం ఎన్నికల సంఘానికి లేదని ఆయన సోమవారం స్పష్టం చేశారు. అవసరమైతే తామే ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ, "రాహుల్ గాంధీకి నోటీసులు ఇవ్వడానికి వాళ్లెవరు? వాళ్లను నోటీసులు ఇవ్వమనండి. నోటీసులు ఇచ్చే అధికారం మాకుంది, మేమే వాళ్లకు నోటీసులు పంపిస్తామని డికె శివకుమార్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య బద్ధంగా తాము ఎన్నికల్లో గెలిచామని, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే హక్కు మాత్రమే ఇసికి ఉందని, తమకు నోటీసులు జారీ చేసే హక్కు లేదని ఆయన అన్నారు. ఇసి నోటీసులపై చట్టపరంగా స్పందిస్తామని తెలిపారు. ఎన్నికల్లో మోసం జరిగిందంటూ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) వి. అన్బుకుమార్ రాహుల్‌కు నోటీసులు జారీ చేశారు. ఈనెల7న ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో షకున్ రాణి అనే మహిళ రెండుసార్లు ఓటు వేశారని రాహుల్ ఆరోపించారు. పోలింగ్ అధికారి రికార్డుల ప్రకారమే తాను ఈ విషయం చెబుతున్నానని, అందుకు సంబంధించిన పత్రాన్ని కూడా ప్రదర్శించారు. అయితే, రాహుల్ చూపించిన పత్రం అధికారికమైనది కాదని సిఇఒ తన నోటీసులో పేర్కొన్నారు. తాము జరిపిన ప్రాథమిక విచారణలో షకున్ రాణి ఒక్కసారే ఓటు వేసినట్లు తేలిందని వివరించారు. ఈ నేపథ్యంలో, షకున్ రాణి గానీ, మరెవరైనా గానీ రెండుసార్లు ఓటు వేశారని నిర్ధారణకు రావడానికి మీ వద్ద ఉన్న ఆధారాలను, సంబంధిత పత్రాలను సమర్పించాలని రాహుల్ గాంధీని ఆ నోటీసులో కోరారు. దీని ఆధారంగా తాము పూర్తిస్థాయి విచారణ చేపడతామని తెలిపారు. ఈ నెల 8న జరిగిన ఓ ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, గత 10 ఏళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వీడియో రికార్డింగ్‌లను భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే, ఇసిఐ నేరాన్ని దాచిపెడుతున్నట్లే నని ఆయన ఆరోపించారు.



## ప్రధాని ఎస్పీజీలో మహిళా అధికారి

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** దేశంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత పొందే ఏకైక వ్యక్తి ప్రధాని మోడీ. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ ఆయన్ను అనుక్షణం కంటికిరెప్పలా కాపాడుతుంది. ఇటీవల మోడీ బ్రిటన్ పర్యటనలో భాగంగా ఓ ఫోటో వైరలైంది. ప్రధాని వెనుకాల ఉన్న మహిళా ఎవరనే విషయం ఆసక్తిగా మారింది. ఆమె పేరు అదాసో కపేసా. ఎస్‌పిజిలో తొలి మహిళా ఆఫీసర్‌గా ఘనత సాధించారు. మణిపుర్ సేనాపతి జిల్లాలోని కైబీగ్రామం అదాసో కపేసా స్వస్థలం. సశస్త్ర సీమా బల్‌లక్ష చేరిన ఆమె ఉత్తరాఖండ్ పిథోడ్‌గఢ్‌లోని 55వ బెటాలియన్‌లో సేవలందించేవారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిణి అయిన ఆమె ఎస్‌పిజిలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులోకి ప్రవేశించడం ఆషామాషీ వ్యవహారం కాదు. యుద్ధ మెలకువలు, వ్యూహాత్మక నిఘా, హైసెక్యూరిటీ ప్రొటోకాల్ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే తీరు అంశాల్లో కచ్చితత్వం కనబర్చిన కపేసా ఇందులో అడుగుపెట్టారు. కఠినమైన ప్రమాణాలతో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన భద్రతా దళాల్లో ఒకటిగా పేరుపొందిన ఎస్‌పిజి బృందంలో కపేసా ప్రవేశించడం వ్యూహాత్మకం, చరిత్రాత్మకంగాను భావిస్తున్నారు. ముఖ్యంగా భద్రతా బలగాల్లో స్త్రీ, పురుష భేదం లేదని నిరూపించే ప్రయత్నంచేశారు.1985లో ఎస్‌పిజి ఏర్పాటైనప్పటి నుంచి ఓ మహిళా అధికారిణి ఇందులో విధులు నిర్వర్తించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రధాని బ్రిటన్ పర్యటనలో కపేసా విధుల్లో ఉండటంతో ఆమెపై సోషల్ మీడియాలో ప్రశంసలుకురిశాయి. ఆమె సరికొత్త ఘనత సాధించారని, శక్తిక ప్రతిరూపంగా, ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారంటూ నెటిజన్లు స్పందించారు.

## డాలరుతో బలపడిన రూపాయి

### 87.53వద్ద కరెన్సీ ట్రేడింగ్ ముగింపు



**ముంబయి, ఆగస్టు 12:** అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాల నేపథ్యంలో, అమెరికా సుంకాల విధింపుపై ఆందోళనలు కొనసాగుతున్న ప్పటికీ సోమవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలపడింది. ఉదయం మార్కెట్ ప్రారంభమైనప్పుడు, రూపాయి 13 పైసలు లాభపడి 87.53వద్ద ట్రేడ్ అయింది. శుక్రవారం ముగింపు ధర 87.66గా ఉన్న సంగతి తెలిసిందే. ఈ వారం జరగనున్న అమెరికారష్యా చర్చల పట్ల మార్కెట్లో ఆశావాహ దృక్పథం నెలకొంది. ఈనెల 15న జరగనున్న ఈ చర్చల ఫలితంగా రష్యాఉక్రెయిన్ యుద్ధం ముగింపుదశకు చేరుకుంటుందన్న అంచనాలు బలపడ్డాయి. ఈ ఆశావాదమే రూపాయి బలపడటానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీనికి తోడు, అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు తగ్గడం కూడా రూపాయికి కలిసొచ్చింది. సోమవారం ఉదయం బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 66.25 డాలర్లకు పడిపో యింది. మరోవైపు అమెరికా నుంచి సుంకాల ముప్పు పొంచి ఉంది.

భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 25 శాతం అదనపు సుంకాలను విధించాలని అమెరికా ప్రతిపాదించింది. ఈ కొత్త సుంకాలు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. ఒకవేళ ఈ సుంకాలు అమలైతే, దేశీయంగా టెక్స్‌టైల్స్, లెదర్, సీఫుడ్ వంటి రంగా లపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఇది ఎగుమతి రాబడులను తగ్గించి రూపాయిపై ఒత్తిడి పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటు న్నందుకు గాను చైనా, టర్కీ వంటి దేశాలతో పోలిస్తే భారత్‌పైనే కఠినమైన సుంకాలను ప్రతిపాదించడాన్ని భారత ప్రభుత్వం అన్యాయం, నిర్హేతుకం" అని విమర్శించింది. ఈ వారంలో దేశీయ, అంతర్జాతీయ ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడను న్నాయి. ఈ నెల 12న దేశీయ సిపిఐ, 14న డబ్ల్యూపిఐ గణాంకాలు విడుదల కాను న్నాయి. దీంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్‌ఐఐ) అమ్మకాలు కొనసాగిస్తుండగా, దేశీయ సంస్థాగత మదుపరులు (డిఐఐ) కొనుగోళ్లతో మార్కెట్‌కు మద్దతు నిస్తున్నారు.

## ఢిల్లీ వాషింగ్టన్ విమాన సర్వీసులు నిలిపివేత

### ఎయిరిండియా తాజా నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** టాటా గ్రూప్ యాజమాన్యం లోని ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ నుంచి అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీకి నేరుగా నడిచే విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ నిర్ణయం 2025 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. నిర్వహణా పరమైన కారణాలతోనే ఈ చర్యలు చేపడుతున్నట్లు సంస్థ ఒకప్రకటనలో పేర్కొంది. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ఎయిర్ ఇండియా తన ఫ్లీట్‌లోని 26 బోయింగ్ 7878 విమానాలకు రెట్రోఫిటింగ్ పనులను గతనెలలో ప్రారంభించింది. ఈ ఆధునికీకరణ ప్రక్రియ 2026 చివరి వరకు కొనసాగనుంది. ఈ సమయంలో పలు విమానాలు సేవలకు అందుబాటులో ఉండవు. దీనివల్ల ఏర్పడే విమానాల కొరత, అలాగే పాకిస్థాన్ గగనతలం ఇంకా మూసివేసి ఉండటంతోసుదూర ప్రయాణాలకు ఎక్కువ సమయం పట్టడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈనిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్ ఇండియా వివరించింది. ఇప్పటికే సెప్టెంబర్ 1 తర్వాత వాషింగ్టన్ డీసీకి టికెట్లు బుక్ చేసుకున్న ప్రయా ణికులను సంప్రదించి, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేస్తామని ఎయిర్ ఇండియా హామీఇచ్చింది. ప్రయాణికుల ఇష్టప్రకారం ఇతర విమానాల్లో సీట్లు కేటాయించడం లేదా టికెట్ డబ్బును పూర్తిగా వాపసు చేయడం వంటి ఆప్షన్లు అందిస్తామని పేర్కొంది. అయితే, ఈ డైరెక్ట్ ఫ్లైట్ రద్దయినా ప్రయాణికులు తమ భాగస్వామ్య విమానయాన సంస్థలైన అలస్కా ఎయిర్‌లైన్స్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్, డెల్టా ఎయిర్‌లైన్స్ ద్వారా న్యూయార్క్ (జేఎఫ్‌కే), నెవార్క్ (ఈడబ్ల్యూఆర్), చికాగో, శాన్ ఫ్రాన్సిస్కో‌ల మీదుగా వాషింగ్టన్ డీసీకి వన్‌స్టాప్ విమాన సేవలు యథావిధిగా అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది.

## భార్య మృతదేహం బైక్‌కు కట్టి తీసుకు వెళ్లిన భర్త

### సాయం కోసం ఆర్తనాదాలు..

**నాగ్‌పూర్, ఆగస్టు 12:** నాగ్‌పూర్‌లో మానవత్వాన్ని ప్రశ్నించే అత్యంత విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో కళ్లెదుటే భార్య ప్రాణాలు కోల్పోగా, సహాయం కోసం భర్త చేసిన ఆర్తనాదాలు అరణ్యరోదనలయ్యాయి. గంటల తరబడి వేచి చూసినా ఎవరూ కనీసం స్పందించకపోవడంతో, చివరకు భార్య మృతదేహాన్ని తన బైక్‌కు కట్టుకుని సొంతూరుకు బయలుదేరాడు. ఈ హృదయ విదారక దృశ్యం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అందరినీ కంటతడి పెట్టిస్తోంది. మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాకు చెందిన అమిత్ యాదవ్ (35), గ్యార్సి దంపతులు ఉపాధి కోసం నాగ్‌పూర్‌లోని లోనారా ప్రాంతంలో నివసిస్తున్నారు. ఈనెల 9న రాఖీ పండుగ సందర్భంగా వీరు బైక్‌పై నాగ్‌పూర్ నుంచి మధ్యప్రదేశ్‌లోని తమ స్వగ్రామం కరన్‌పూర్‌కు బయలుదేరారు. నాగ్‌పూర్ జబల్‌పూర్ జాతీయ రహదారిపై మోర్ఫాటా సమీపంలోకి రాగానే, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ ట్రక్కు వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గ్యార్సి కిందపడిపోగా, ట్రక్కు ఆమెపై నుంచి దూసుకెళ్లింది. డ్రైవర్ ట్రక్కును ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో గ్యార్సి అక్కడికక్కడే మృతి చెందింది. భార్య మరణంతో కుప్పకూలిపోయిన అమిత్ యాదవ్, సహాయం కోసం అటుగా వెళ్తున్న వాహనదారులను వేడుకున్నాడు. కానీ, ఎవరూ ఆగలేదు. ఏం చేయాలో పాలుపోని నిస్సహాయ స్థితిలో, భార్య మృతదేహాన్ని తన బైక్‌కు కట్టుకుని సొంతూరుకు తీసుకెళ్లేందుకు సిద్ధపడ్డాడు. కొంత దూరం ప్రయాణించిన తర్వాత, పోలీసులకు ఈ విషయం తెలిసింది. వెంటనే వారు వెళ్లి అమిత్ యాదవ్‌ను ఆపారు. అనంతరం మృతదేహాన్ని నాగ్‌పూర్‌లోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ఘటన మానవ సంబంధాలు, సామాజిక బాధ్యతపై తీవ్ర చర్చకు దారితీసింది.

## లోయలో పడిపోయిన పికప్ ట్రక్

### ఏడుగురు మహిళలు దుర్మరణం, పలువురికి గాయాలు


**పూణె,ఆగస్టు 12:** మహారాష్ట్రలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భక్తులతో వెళ్తున్న ఒక పికప్ ట్రక్కు అదుపుతప్పి లోయలో పడటంతో ఏడుగురు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో చిన్నారులతో సహా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పుణె జిల్లాలోని ఖేడ్ తాలూకా పరిధిలో ఉన్న పాపల్‌వాడి గ్రామానికి చెందిన పలువురు భక్తులు కుందేశ్వర్ శివాలయంలో దర్శనం కోసం పికప్ ట్రక్కులో బయలుదేరారు. ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుండగా వాహనం అకస్మాత్తుగా అదుపుతప్పి బోల్తా పడింది. అనంతరం దాదాపు 25 నుంచి 30 అడుగుల లోతైన లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు మహిళా భక్తులు దుర్మరణం పాలయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సేవల బృందాలు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను పైత్‌లోని గ్రామీణ ఆసుపత్రితో పాటు సమీపంలోని ఇతర వైద్యశాలలకు తరలించాయి.

ఈ ప్రమాదంలో సుమారు 25 నుంచి 35 మంది వరకు గాయపడినట్లు పింప్రిచించ్‌వాడ్ డిసిపి శివాజీ పవార్ తెలిపారు. గాయపడిన వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నారని, కొందరి పరిస్థితి విషమంగా ఉందని ఆయన వివరించారు. పుణె ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం (పీఎంఓ) ఒక ప్రకటన విడుదల చేసింది.

ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఎక్స్ గ్రేషియా అందిస్తామని ప్రకటించారు. ఈ ఘటనపై ఖేడ్ పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### 1971 యుద్ధ వీరుడు పారుల్కర్ కన్నుమూత



**హైదరాబాద్, ఆగస్టు 12:** భారత్, పాకిస్తాన్‌ల మధ్య 1971లో జరిగిన యుద్ధంలో పాక్‌కు బందీగా చిక్కి ఆ దేశంలో చాలాకాలం పాటు కారాగారవాసంలో వుండి తప్పించుకుని ఇండియాకు వచ్చిన యుద్ధ వీరుడు డికె ఫారుల్కర్ (82) ఆదివారంనాడు పూణేలో గుండె పోటుతో కన్ను మూశారు. డికె పారుల్కర్ పూర్తి పేరు దిలీప్ కమలాకర్ పారుల్కర్. అప్పట్లో భారత వాయుసేనలో గ్రూప్ కెప్టెన్‌గా పనిచేసిన పారుల్కర్ వింగ్ కమాండర్‌గా వున్న సమయంలో 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం సంభవించింది. ఈ సందర్భంగా పాక్ భూభాగంలో ఫైటర్ జెట్ విమానంతో బాంబులు వేసిన ఆయన విమానం కూలిపోగా పాక్ సైనికులకు బందీగా చిక్కారు. ఆ తరువాత ఆయన చాలా కాలం పాటు పాక్ జైల్లో వున్నారు. అయితే తనతో పాటు పాక్ చెరలో వున్న ఇద్దరు భారత సైనికులతో కలిసి జైలు నుంచి పారుల్కర్ సాహోసపేతంగా తప్పించుకున్నారు. పారుల్కర్‌తో పాటు మరో ఇద్దరు ఖైదీలు తప్పించుకున్న విషయం రెండు రోజుల తరువాత కానీ పాక్‌కు తెలియలేదంటే ఆయన ఎంత పక్కాగా పథకం రచించారో ఊహించుకోవచ్చు.


### భారత్‌కు పాక్ సైన్యాధిపతి అణు బెదరింపులు..

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్తాన్ సైన్యాధిపతి అసీం మునీర్ అక్కడి నుంచే భారత్‌పై అణు బెదిరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఉన్మాద దేశమని దుయ్యబట్టింది. అమెరికా అండ చూసుకుని ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోందని మండిపడింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ దీనిపై ప్రకటన విడుదల చేసింది. అణ్వాయుధాల వినియోగంపై బెదిరింపులు పాక్‌కు అలవాటే. ఇలాంటి వ్యాఖ్యలతో ఆ దేశం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అంతర్జాతీయ సమాజం అర్థం చేసుకోవాలి. పాక్ అణ్వాయుధాలపై ఎవరి నియంత్రణ ఉందో దీన్ని బట్టి స్పష్టమవుతోంది.

### ఇసిని రిగ్గింగ్ యంత్రంగా మార్చిన బిజెపి: స్టాలిన్

**చెన్నై, ఆగస్టు 12:** బిజెపి ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇటీవల చేసిన ఆరోపణలకు తమిళనాడు సిఎం, డిఎంకె చీఫ్ ఎంకె స్టాలిన్ మద్దతు తెలిపారు. ఎన్నికల సంఘాన్ని బిజెపి 'పోలింగ్ రిగ్గింగ్ యంత్రం'గా మార్చిందంటూ ఆరోపణలు గుప్పించారు. ఈ పోరాటంలో కాంగ్రెస్ డిఎంకె కలిసి నిలబడుతుందన్నారు. బిజెపి ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే అపహాస్యం చేస్తుంటే మౌనంగా ఉండలేం అని వ్యాఖ్యానించారు. ప్రతి రాష్ట్రానికి పూర్తి మెషిన్ రీడబుల్ ఓటరు జాబితా విడుదల చేయాలని ఈ సందర్భంగా స్టాలిన్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్వతంత్ర్య దర్యాప్తు జరపాలని కోరారు. మరోవైపు, ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కోసం ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్నాయని, స్పష్టమైన ఓటర్ల జాబితాను ఇసి విడుదల చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. కర్ణాటకలో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఓ నియోజకవర్గంలో సర్వే నిర్వహించగా దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలిన విషయాన్ని గుర్తు చేశారు.

### కాల్పుల్లో కొలంబియా సెనెటర్ మృతి



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** కొలంబియా సెనేటర్, అధ్యక్ష అభ్యర్థి మిగ్యుల్ ఉరిబ్ టర్బే మరణించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ప్రాణాలు కోల్పోయారు. జూన్‌లో మిగ్యుల్ బహిరంగ ప్రదేశంలో నిర్వహించిన ఓ ప్రచార కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా ఓ దుండగుడు ఆయన వెనుక నుంచి తలపై పలుమార్లు కాల్పులు జరిపాడు. వెంటనే అప్రమత్తమై అధికారులు ఆయనను ఆసుపత్రికి తరలించారు. బొగోటా మేయర్ కార్లోస్ గాలన్ ఈ విషయాన్ని ధృవీకరించారు. అనంతరం 15 ఏళ్ల నిందితుడు సహా ఈ కేసులో అయిదుగురు అనుమానితులను కొలంబియా పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనను మిగ్యుల్ పార్టీ కన్జర్వేటివ్ డెమొక్రసీ తీవ్రంగా ఖండించింది. ఈ హత్యాయత్నంలో రాజకీయ కోణం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేసింది. నాటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతను సోమవారం కన్నుమూశారు. కాగా వచ్చే యేడాది కొలంబియాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష కన్జర్వేటివ్ డెమోక్రటిక్ పార్టీ నుంచి మిగ్యుల్ పోటీకి దిగారు.

## మంగళగిరి నియోజకవర్గంలో నేడు నారా లోకేష్ - నారా బ్రాహ్మణి పర్యటన



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి నేడు పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా నారా బ్రాహ్మణి ఉదయం 10.30 గంటలకు మంగళగిరి గోలి వారి వీధిలోని లక్ష్మి శారీస్ వస్త్ర దుకాణాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు కాజ గ్రామ పంచాయతి కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ కేంద్రాన్ని సందర్శించి, స్థానిక మహిళలతో పరస్పరం ముచ్చటించనున్నారు.
సాయంత్రం 4 గంటలకు మంత్రి నారా లోకేష్ పాత మంగళగిరి జీ ఆర్ స్కూల్ రోడ్డులో నూతనంగా నిర్మితమైన ఆర్.ఆర్. హ్యాండ్లూమ్ షోరూమ్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో సమావేశమై, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరపనున్నారు.

## ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి - ఆర్టీసీ ఇ.యు హెచ్చరిక

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్టీసీ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించి, పిఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వీ. నరసయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం 2022 నుండి రిటైర్ అయిన, మరణించిన ఆర్టీసీ ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్, 2024 డిసెంబర్ నుండి గ్రాట్యూటీ బకాయిలు ఇంకా చెల్లించకపోవడంతో ఆ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా 11వ పిఆర్సీకి సంబంధించిన 24 నెలల బకాయిలు, డిఏ బకాయిలు, ఇంకా రావలసిన నాలుగు కొత్త డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఐదేళ్లుగా పదోన్నతులు ఇవ్వకపోవడం కూడా ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేస్తోందని తెలిపారు.
జీఓ 137 రద్దు చేసి, విజయవాడలో గవర్నర్‌పేట 1, 2 డిపోలు సహా రూ.400 కోట్ల విలువైన ఆర్టీసీ ఆస్తులను లులూ మాల్‌కి కేటాయించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి గత నెల 4, 5 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించామని, ప్రస్తుతం 20 జిల్లాలలో ముఖ్యనాయకుల సమావేశాలు, ప్రెస్‌మీట్లు పూర్తయ్యాయని, మిగిలిన ఆరు జిల్లాల్లో 17న ఈ కార్యక్రమాలు జరగనున్నాయని వివరించారు.

## పంచాయతీ రాజ్ టీచర్ల కుటుంబాలకు తక్షణ కారుణ్య నియామకాలు చేయాలి: ఏపీటీఎఫ్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గత ఐదు సంవత్సరాలుగా పంచాయతీ రాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద తక్షణమే చేపట్టాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయ రాజు, ప్రధాన కార్యదర్శి యస్. చిరంజీవి ప్రభుత్వంను కోరారు. మంగళవారం ఏపీ సెక్రటేరియట్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, కమిషనర్ కృష్ణ తేజ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్య సంఘాలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు పంచాయతీ రాజ్ యాజమాన్యంలోని టీచర్లు, పాఠశాలలకు సంబంధించిన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాల విభజన తర్వాత విడిపోయిన ఉపాధ్యాయుల జడ్పీపిఎఫ్ సబ్‌స్క్రిప్షన్, ఫైనల్ పేమెంట్ సమస్యలు, తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన 8 మండలాల్లో టీచర్లు, ఉద్యోగుల పీఎఫ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా వారు కోరారు. అలాగే జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్‌లకు సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలని, ప్రతి ఉన్నత పాఠశాలలో ఒక నాన్-టీచింగ్ స్టాఫ్ పోస్టు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బదిలీ అయినప్పుడు వారి పీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ నిరంతరాయంగా కొనసాగేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ అప్డేషన్ చేపట్టాలని వారు సూచించారు. ఈ సమస్యలపై చీఫ్ సెక్రటరీతో చర్చించి త్వరితగతిన పరిష్కారం తీసుకురావాలని అధికారులు హామీ ఇచ్చినట్లు ఏపీటీఎఫ్ నాయకులు వెల్లడించారు.

## లక్ష గౌరమ్మల వ్రతంలో తరించిన మహిళాభక్తులు

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** శ్రావణమాస విశిష్టతా క్రమంలో శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి స్వీయ పర్యవేక్షణలో గౌరమ్మ తల్లి మహిమలు చాటుతూ విశేష పూజలు నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్ నందు, శ్రీ సాలిగ్రామ మఠం, శ్రీ విద్యాపీఠం సంయుక్త నిర్వహణలో కొనసాగుతున్న అర్థ చాతుర్మాస దీక్ష పూజలలో భాగంగా, మంగళవారం లక్ష గౌరమ్మల వ్రతాన్ని మహిళా భక్తులతో విశేషంగా నిర్వహించారు. పెనుగొండ శ్రీ వాసవి పీఠం పీఠాధిపతులు శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి స్వీయ పర్యవేక్షణలో లక్ష గౌరమ్మల వ్రతం ప్రాధాన్యతను చాటుకుంది. కార్యక్రమ విశిష్టతను స్వామి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాలిగ్రామ మఠం, ట్రస్టు చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, గోపు రామకృష్ణ, ముద్దాబత్తుని రమణయ్య, తదితర కార్యవర్గ సభ్యులు అశేష సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద నిధికి విజయవాడ దాత విరాళం



**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైల దేవస్థానం శాశ్వత అన్నప్రసాద వితరణకు విజయవాడకు చెందిన యస్. సత్యప్రసాద్ రూ. 1,11,000 విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఈ మొత్తాన్ని దేవస్థానం పర్యవేక్షకులు రవికుమార్ స్వీకరించారు. అనంతరం దేవస్థానం తరపున దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.

# క్విట్ ఇండియా ఉద్యమ అమరవీరులకు స్మరించుకోవడం మన బాధ్యత

○ **మంత్రి నాదెండ్ల మనోహర్**



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** దేశస్వాతంత్ర్య ఉద్యమంలో కీలక ఘట్టమైన క్విట్ ఇండియా ఉద్యమంలో ఈప్రాంత ఉద్యమ కారుల ధైర్య సాహసాలు, బ్రిటీష్ పార్లమెంట్ చర్చించుకున్న, ఉద్యమ చరిత్ర తెనాలికి ఉందని, అమరవీరులను ప్రతి ఏటా ఆగస్టు 12న స్మరించుని, నివాళులు అర్పించడం భారతీయులుగా అది ఒక బాధ్యతని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం
రణరంగ చౌక్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళి అర్పించిన మంత్రి నాదెండ్ల మనోహర్ క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారి స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో రణరంగ చౌక్‌లో క్విట్ ఇండియా అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మనోహర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీ పిలుపు మేరకు 1942 ఆగస్టు 12న తెనాలిలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో ఏడుగురు ఉద్యమకారులు అమరులయ్యారని గుర్తుచేశారు. మాజేటి సుబ్బారావు, సిరిగిరి లింగం, భాస్కరుని లక్ష్మీనారాయణ, తమ్మినేని సుబ్బారెడ్డి, గాలి రామకోటయ్య, ప్రయాగ రాఘవయ్య, జాస్తి అప్పయ్యల ప్రాణత్యాగం, భావి తరాలకు తెలియాలని అన్నారు . స్వరాజ్యం కోసం రైతాంగం తమ ఆస్తులను త్యాగం చేశారని, మహిళలు తమ మెడలోని నగలను గాంధీజీకి అందజేసి దేశ సేవలో భాగమయ్యారన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రజాసేవలు అందిస్తున్న, D-SP జనార్ధనరావు, స్వాతంత్ర్య సమరయోధుడు షేక్ అబ్దుల్ వహబ్ కోడలు నూర్జహాన్, హెల్పింగ్ సోల్జర్స్ ప్రతినిధి ఇనయతుల్లా, శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, తదితరుల ను శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, సబ్ కలెక్టర్ సంజనసింహ, మున్సిపల్ చైర్‌పర్సన్ టి. రాధిక, కమిషనర్ వి.ఎం లక్ష్మీపతి, తహసిల్దార్ కే వి గోపాల్ కృష్ణ, వార్డ్ కౌన్సిలర్ సంజీవరెడ్డి తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

## మాతా-శిశు విభాగం, ఆధునిక వైద్య యూనిట్ల ప్రారంభం



**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్):** రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన మాతా శిశు సంక్షేమ విభాగం, ప్రత్యేక నూతన శిశు సంరక్షణ యూనిట్లు, పెడియాట్రిక్ ఐసీయూలను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆసుపత్రి వసతులను పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. రోగుల సమస్యలు, అవసరాలు, అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ విభాగాలు తల్లి మరియు శిశువుల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ప్రత్యేకించి అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ఈ యూనిట్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. "ప్రతి తల్లి, శిశువు ఆరోగ్యమే రాష్ట్ర భవిష్యత్తుకు పునాది. అందుకే మేము ఆసుపత్రులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, సమగ్ర సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నాం. ప్రజల ఆరోగ్యాన్ని కూటమి ప్రభుత్వం పరిరక్షించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆది రెడ్డి, ఎమ్మెల్యే రామకృష్ణ రెడ్డి, ఎమ్మెల్యే బలరామ్ కృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## 30 ఏళ్ల తర్వాత పులివెందులలో గెలిచిన ప్రజాస్వామ్యం



○ పల్లా శ్రీనివాసరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలు చారిత్రాత్మక మలుపు తీసుకున్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా నేడు మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత ఈ రెండు ప్రాంతాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగడం రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన పరిణామంగా నిలిచింది. గతంలో నామినేషన్ వేయాలన్నా ప్రాణభయం ఉండగా, ఈసారి ప్రజలు స్వేచ్ఛగా పోటీ చేసే పరిస్థితి ఏర్పడింది. పులివెందుల 11, ఒంటిమిట్టలో 11 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నంబర్ వైసీపీ 'లక్కీ నంబర్'. వాస్తవానికి ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడానికి ముందుకు రావడమే నిజమైన విజయమన్నారు.
ఈ ఎన్నికల్లో ఏ ఒక్క ఓటరుపై కూడా భయభ్రాంతులు లేవని, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. వైసీపీ నేతలు ఎన్నికల కమిషనర్ టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తుందని, పోలీసులు వైసీపీ నేతలపై దౌర్జన్యం చేస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నె వైసీపీ ప్రభుత్వంలో నియమించినవారేనని గమనించాలన్నారు. ఓటమి భయంతో వైసీపీ తప్పుడు ఆరోపణలు చేస్తోందని, ఎన్నికలు పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగాయన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఇది ఆరంభం మాత్రమేనని, ఈ జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపొంది చరిత్ర సృష్టించబోతుందని అన్నారు.

## జూనియర్ రెడ్ క్రాస్ లాంచ్ - గవర్నర్‌కు ఎమ్మెల్యేలు నసీర్,గళ్ళా మాధవి స్వాగతం





**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం జూనియర్ రెడ్ క్రాస్ ప్రాజెక్ట్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీ కమిటీ చైర్మన్ నసీర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిలు గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సేవాస్ఫూర్తి, మానవతా విలువలు, సామాజిక బాధ్యతా భావం పెంపొందించడంలో జూనియర్ రెడ్ క్రాస్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. భవిష్యత్తు తరాలను సమాజ సేవ వైపు దారితీసేలా ఈ ప్రాజెక్ట్‌ను మరింత విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు నసీర్ ,గళ్ళా మాధవి మాట్లాడుతూ, గుంటూరు జిల్లా విద్యార్థులు, యువత ఈ ప్రాజెక్ట్ ద్వారా సామాజిక సేవలో చురుకైన పాత్ర పోషించేందుకు ప్రోత్సాహం పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనకే లక్ష్యం - గుంటూరు జిల్లా పోలీస్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** శక్తివంతమైన, ఆరోగ్యకరమైన, శాంతియుత సమాజ నిర్మాణం కోసం గంజాయి నిర్మూలన దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం గుంటూరులోని పోలీస్ కళ్యాణ మండపంలో జరిగిన మీడియా సమావేశంలో, ఈగిల్ సెల్ ఎస్పీ నగేష్ కుమార్‌తో కలిసి గంజాయి దహనానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. జిందాల్ ప్లాంట్ ఆపరేషన్ ప్రెసిడెంట్ ఎం.వి. చారి సహకారంతో, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక, ఆరోగ్యశాఖల పర్యవేక్షణలో, నార్కోటిక్ కంట్రోల్ బోర్డు నిబంధనల ప్రకారం నల్లపాడు పరిధిలోని ఓబులనాయుడు గ్రామ సమీపంలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లో గంజాయి దహనం జరిగిందన్నారు.
2016-2024 మధ్య 17 పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 113 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 1,868 కిలోల పొడి గంజాయి, 2.233 లీటర్ల ద్రవ గంజాయి, 0.023 గ్రాముల ఎండీఎంఏ, ఇతర సింథటిక్ మాదక ద్రవ్యాలను చట్ట ప్రకారం ధ్వంసం చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు 44 కేసులు నమోదై, 143.96 కిలోల పొడి గంజాయి, 1.172 లీటర్ల ద్రవ గంజాయి, 500 గ్రాముల హైడ్రో గంజాయి స్వాధీనం అయ్యాయి. ఈ కేసుల్లో 219 మందిలో 173 మందిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. వారిలో 107 మంది 25 ఏళ్ల లోపు వయస్సు గలవారని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి నేరాలను అరికట్టేందుకు పీఐటీ ఎన్.డీ.పీ.ఎస్ చట్టం కింద తరచూ ఈ రకమైన నేరాలకు పాల్పడేవారిని ఒక సంవత్సరం వరకు జైలులో ఉంచే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు 15 మందిని గుర్తించి, 11 మందిపై చర్యల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించగా, మిగిలిన 6 ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు.
ఈగిల్ విభాగం సమన్వయంతో పలు దాడులు జరిపి, పాత నేరస్తులపై నిఘా పెట్టినట్టు తెలిపారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ కేసుల్లో ప్రమేయం ఉన్న 82 మందిని గుర్తించి, వారిలో 10 మందికి జియో ట్యాగింగ్ అమలు చేసి, వారి కదలికలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి సాగు దాదాపుగా లేనప్పటికీ, ఒడిశాలోని కోరాపుట్, మల్కాన్‌గిరి ప్రాంతాల నుంచి సరఫరా అవుతోందని తెలిపారు.
జిల్లాలో 36 మాదకద్రవ్య హాట్‌స్పాట్లు గుర్తించి కఠిన నిఘా అమలు చేస్తున్నట్టు చెప్పారు. పాడు భవనాలను కూల్చివేయాలని, లైటింగ్ లేని ప్రాంతాల్లో దీపాల ఏర్పాటు, సున్నిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.
జిల్లాలో ఇప్పటివరకు 768 పాఠశాలలు, 71 కళాశాలల్లో ఈగిల్ క్లబ్‌లు స్థాపించగా, 120 మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలు, ఐసోలేటెడ్ మండలాల్లో డ్రోన్ నిఘా కొనసాగుతోంది. అన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు లకు ఎన్.డీ.పీ.ఎస్ చట్టం ప్రకారం కేసులు వేగంగా నమోదు చేయాలని సూచించారు.
ఈగిల్ విభాగం ఏర్పడ్డప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 68 వేల కిలోల గంజాయి స్వాధీనం అయ్యిందని, 'డ్రగ్స్ వద్దు బ్రో', 'సేఫ్ క్యాంపస్ జోన్', 'ఆపరేషన్ ఎన్ఆర్ఐ స్టడ్స్', 'ఆపరేషన్ చైతన్యం', 'ఆపరేషన్ హాట్‌స్పాట్' వంటి కార్యక్రమాల ద్వారా గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నామని నగేష్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవి కుమార్, సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు, డీటీసీ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఈగిల్ సీఐ విక్టర్, మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, నల్లపాడు సీఐ వంశీధర్, వట్టి చెరుకూరు సీఐ రామా నాయక్, పెదకాకాని సీఐ నారాయణ స్వామి, ఇతర పోలీస్, రెవెన్యూ, ఆరోగ్య, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం చేయూతపై హర్షం వ్యక్తం చేస్తూ ఆలయంలో ప్రత్యేక పూజలు

○ **శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి స్వీట్స్ పంపిణీ చేసిన గీత కార్మికులు**



**మంగళగిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని గౌడ నాయకులు అన్నారు. కల్లుగీత కార్మికులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న చేయూతపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయంలో పీఎం మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ పేర్లపై నియోజకవర్గ గౌడ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి కూటమి ప్రభుత్వానికి గీత కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. 108 కొబ్బరికాయలు కొట్టి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర తెలుగునాడు గీతకార్మిక సంఘం అధ్యక్షులు రేఖా సుధాకర్, నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు, మంగళగిరి పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు మాట్లాడుతూ గీతకార్మికులు ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పాటు అయ్యేలా పదిశాతం మద్యం దుకాణాలను కేటాయించటం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని పేర్కొన్నారు. కష్టాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న వారిలో గౌడలు / గీత ముందంజలో ఉంటారన్నారు. రాష్ట్రంలో 3,534 కల్లుగీత సహకార సమాఖ్యల్లో 1.06 లక్షల మంది కల్లుగీత కార్మికులు ఉండగా వీరికి ఆర్థికంగా చేయూతనివ్వడం కోసం ప్రత్యేక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. 2018-19 ఏడాదికి కల్లుగీత కార్మికులకు ఆర్థిక చేయూత కోసం టీడీపీ ప్రభుత్వం రూ.70 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. 15 మంది సభ్యులతో గ్రూప్ ఏర్పాటు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించింది. 50శాతం సబ్సీడీతో రూ. 30 లక్షల వరకు రుణాలిచ్చి సొంత కాళ్లపై నిలబడేలా చేసిందని చెప్పారు. 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికుడికి రూ. 2వేల పింఛన్ అందించినట్లు తెలిపారు. కల్లు పాలసీ 2017-22 ప్రకటించాం. నూతన కల్లు పాలసీపై ప్రభుత్వం జీఓ నెం. 11 జారీ చేసిందన్నారు. నూతన పాలసీలో భాగంగా పన్ను మినహాయింపుతో పాటు కల్లు విక్రయించుకునే సౌలభ్యం కల్పించిందని చెప్పారు. ప్రతి ఐదేళ్లకోసారి కల్లు పాలసీని పునరుద్ధరించేలా ఏర్పాటు చేసిందని దీనివల్ల రాష్ట్రంలోని 1.06 లక్షల గీత కార్మికులకు ఏటా రూ. 3.43 కోట్ల లబ్ధి కలుగుతోందని పేర్కొన్నారు. కల్లుగీత పాలసీని జీఓ.నెం. 693 ద్వారా గీత కార్మికులను అణచివేసేలా జగన్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరించిందని మండిపడ్డారు. నూతన కల్లుగీత పాలసీ పేరుతో గీత కార్మికులను అణచివేసేలా వైసీపీ పాలన సాగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం అమ్మకాలను ప్రోత్సహించి కల్లుగీత కార్మికుల పొట్ట కొట్టేలా పాలసీ రూపొందించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏమినేని కోటేశ్వరరావు, పాలగాని తాతా రావు, వాకా మంగారావు, తాతా కోటయ్య, ఉయ్యూరు శ్రీను బాబు, జూపల్లి వెంకటేశ్వరరావు, కంచర్ల రంగారావు, కంచర్ల వెంకటేశ్వర రావు, జెముడుగాని రతయ్య, శొంఠి కళ్యాణి, కాటూరి పావని, పాలగాని గంగా ధరరావు, విస్సరపు శేషగిరి, కొమరం బచ్చయ్య, జెముడుగాని భుజంగారావు, సూరగని కిరణ్, పంది రామ కృష్ణ, ఏమినేని రామ మోహన్ రావు, కంచర్ల బద్రి కంచర్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467